తిరుపతి - చిత్తూరు
తెలుగు దినపత్రిక వార్త
30 వార్త 30 వార్షికోత్సవం

నీట్ పున: పరీక్ష నిర్వహణపై

వీడియో కాన్ఫరెన్స్

తిరుపతి కలెక్టరేట్, జూన్ 20 ప్రభాతవార్త :

నీట్ పున: పరీక్ష నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ) సాయి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీ లు, సంబంధిత అధికారులతో సమీక్షించగా.. తిరుపతి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, డిఆర్ఓ నరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. రేపు జూన్ 21 వ తేదీన జరుగు నీట్ పున: పరీక్షను అత్యంత పారదర్శకంగా, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నీట్ పరీక్షను నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎన్టిఏ వారితో సమన్వయం చేసుకొని పరీక్ష విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో నీట్ పున: పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలో 9 కేంద్రాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నీట్ పున: పరీక్ష మధ్యాహ్నం 2.00 గంటలకు నుండి సాయంత్రం 5.15 గంటలకు వరకు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 11: 00 గంటలకు రిపోర్టింగ్ సమయానికి హాజరు కావాలనీ, హాజరయ్యే అభ్యర్థులందరూ మధ్యాహ్నం 1:30 గంటలకు లోపు పరీక్ష కేంద్రాల కు చేరుకోవాలన్నారు. తదుపరి ఎవరికి అనుమతించడం ఉండదన్నారు. అభ్యర్థులు గమనించి సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలనీ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో కలెక్టరేట్ ఏవో , ఎల్ డి ఎం గుంటూరు రవి కుమార్, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి .. కాట్పాడి మధ్య పలు రైళ్ల రద్దు

తిరుపతి,జూన్ 20ప్రభాతవార్త:

పీక్యూఆర్ఎస్ (పట్టాలు త్వరగా మార్చే సెమీ మెకనైజడ్ టెక్నాలజీ) పనుల కోసం జులై 13వ తేదీ వరకు శుక్ర, సోమ వారాల్లో తిరుపతి-కాట్పాడి మధ్య నడిచే పలు రైళ్లను రద్దు చేశారు. ఈనెల 22, 26, 29తేదీలతో బాటు, జూలై 3, 6, 10, 13 తేదీల్లో 16854/53 లోకల్ ట్రైన్‌ను పాక్షి కంగా రద్దు చేశారు. అలాగే ఈనెల 22, 26, 29, జూలై 3, 6, 10, 13 తేదీల్లో 67205, 67210, 67207, 67208 నెంబర్లు గల లోకల్ ట్రైన్‌ను పూర్తిగా రద్దు చేశారు. జూన్ 25న, జూలై 2, 9న చర్లపల్లి-తిరువనంతపురం(07001)ప్రత్యేక రైలును దారి మళ్లించి రేణిగుంట నుంచి మేల్పాకం, కాట్పాడి మీదుగా నడుపుతారని రైల్వే అధికారులు తెలిపారు.

రైతు ఆర్థికంగా బలపడితేనే

రాష్ట్రాభివృద్ధి

- పంట సాగు నుండి మార్కెటింగ్ వరకు ప్రభుత్వం నిరంతరం సమీక్ష
- అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు



చిత్తూరులో రైతులకు అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకం మోగా చెక్కును అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు, జూన్ 20 ప్రభాతవార్త:

రైతు ఆర్థికంగా బలపడితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలోకి పయనిస్తోందని సిఎం నారా చంద్రబాబునాయుడు గుర్తించి రైతు సంక్షేమానికి పెద్దపీట వేసి ప్రతి ఏడాది రైతులకు అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకం ద్వారా నిధులు విడుదల చేస్తున్నారని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు పేర్కొన్నారు. రైతులకు పెట్టుబడి భారం తగ్గించి వ్యవసాయంను లాభసాటిగా మార్చడానికి 2026-27 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకం తొలి విడత ఆర్థిక సహాయంను శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో చేపట్టగా జిల్లా స్థాయి కార్యక్రమంను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుల అధ్వర్యంలో జడ్పీ సమావేశభవనంలో జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, రైతు పంట సాగు ప్రారంభం నుండి మార్కెటింగ్ వరకు పలు సవాళ్ళను ఎదుర్కొంటున్నారని, ప్రతి సమస్యపై ప్రభుత్వం నిరంతరం స్పందిస్తూ సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపడుతుందన్నారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ స్థాయిలో సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందిస్తున్నాయన్నారు. జిల్లాలో ఉద్యానవన పంటల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఫ్రూట్ కవర్లు, మైక్రో ఇరిగేషన్, మౌళిక సదుపాయాల కల్పనకు కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందనే నమ్మకంతో సిఎం నారా చంద్రబాబునాయుడు రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రైతు కష్టంను అర్థం చేసుకున్న నాయకుడు కావడంతో అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకం కింద నేడు నేరుగా నగదు జమ చేసే కార్యక్రమంకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. పంట పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం రైతుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలోని మామిడి రైతుల కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదన్నారు. కేజీకి రూ.4 సబ్సిడీ అందింది మామిడి రైతుకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. జిల్లాలోని వేలాది మామిడి రైతులకు ప్రభుత్వ నిర్ణయం ఎంతో ఊరట కల్పించిందన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరుదులు, సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, సాగునీటి సదుపాయాలు, పంటల బీమా, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, గుడిపాల ఎంపిపి హరిప్రసాద్, టౌన్ బ్యాంకు ఛైర్మన్ రమేష్‌నాయుడు, చిత్తూరు రూరల్ పార్టీ అధ్యక్షులు ప్రభు, నగర పార్టీ అధ్యక్షులు నరేష్, గుడిపాల మండల పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, తెలుగుదేశం నాయకులు మోహన్‌రాజ్, అనిల్‌కుమార్, జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతు నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షలు, యోగాంధ్రకి పటిష్ట బందోబస్తు

-పరీక్షా కేంద్రాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలపై ఎస్పీ కీలక ఆదేశాలు

తిరుపతి,జూన్ 20ప్రభాతవార్త:

తిరుపతినగరంలో నేడు జరిగే నీట్ ప్రవేశ పరీక్షలతోబాటు తారక రామ స్టేడియంలో జరగనున్న యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి చేపట్టాల్సిన భద్రత, ట్రాఫిక్ నియంత్రణ బందోబస్తు ఏర్పాట్లపై జిల్లా ఉన్నతాధికారులతో ఎస్పీ లంకెల సుబ్బరాయుడు శనివారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నీట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. తారక రామ స్టేడియంలో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో, ప్రజల రాకపోకలు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు, అత్యవసర సేవలు భద్రతా ఏర్పాట్లపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీలు శ్రీనివాసులు,రవి మనోహరాచారి , ఐ రామకృష్ణ , ఎస్‌బీ డీఎస్పీ గీతా కుమారి, జిల్లాలోని డీఎస్పీలు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బి.సి.రిజర్వేషన్లపై అధ్యయనం చేస్తున్నాం...

డెడికేషన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

తిరుపతి కార్పొరేషన్, జూన్ 20 ప్రభాతవార్త

వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీం కోర్టు నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు డెడికేషన్ కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర అధ్యయనం చేస్తోందని డెడికేషన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా (రిటైర్డ్ ఐఏఎస్) తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల అమలు, తదితర అంశాలపై అధికారులతో సమీక్షి ంచారు. నగరపాలక సంస్థ కార్యాల యం, స్వర్ణ వార్డుల్లో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను పక్కాగా అమలు చేయాలని తెలిపారు. రిజర్వేషన్లకు సంబంధించిన అన్ని విషయాలను నోటీసు బోర్డుల్లో పొందుపరచాలని తెలిపారు. అలాగే ఇప్పటి వరకు నిర్వహించిన యూనిఫైడ్ సర్వే లో కులాల వారీగా ఉన్న వివరాలను అందుబాటులో ఉంచామని, వాటిని పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని తెలిపారు. ఉద్యోగుల సమ స్యలు, సూచనలు మరియు వినతులు స్వీకరించి వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర నివేదికను రూపొందించడం జరుగుతుందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన డేడికేటెడ్ కమిషన్ విధానాలు అనుసరిస్తుందన్నారు. వాస్తవ ఆధారాలతో కూడిన సమాచార సేకరించేందుకు జిల్లా, మండల, మున్సిపాలిటీ స్థాయిలో విస్తృత పర్యటనలు కమిషన్ నిర్వహిస్తుందని తెలియజేశారు. వివిధ కుల సంఘాలు, సామాజిక వర్గాలతో ప్రత్యేకంగా సమావేశమై వారి సామాజిక, ఆర్థిక సమస్యలు, కుల దృవీకరణ పత్రాలుకు సంబం ధించిన ఇబ్బందులు తదితర అంశాలపై అభిప్రాయాన్ని సేకరిస్తు న్నామని తెలిపారు. తుది నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, మేనేజర్

లారీ ఢీకొని కూలీ మృతి

నాగలాపురం, జూన్ 20 ప్రభాతవార్త:

సైకిల్‌పై తాగునీటి కేనీతీసుకుని రావడానికి వెళ్లిన ఓ కూలిని లారీ వెనుక నుంచి సైకిల్‌ని ఢీకొనడంతో కూలి అక్కడికక్కడే మృత్యువాత పడిన సంఘటన నాగలాపురం మండలం కృష్ణాపురం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ సునీల్‌కుమార్ వివరాల మేరకు... నాగలాపురం పంచాయతీ విఓబానగర్ దళితవాడకు చెందిన సంపత్(50) అనే కూలి శనివారం ఉదయం ఉపాధిమామీ పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చారు. ఇంటిలో తాగునీరు లేకపోవడంతో తాగునీరు తీసుకుని రావడం కొరకు తన సైకిల్‌పై నీళ్ళ క్యాన్ పెట్టుకుని పిచ్చాటూరు మండలం రామగిరి గ్రామ సమీపం ఉన్న వాల్మీకేశ్వర స్వామి ఆలయం వద్దకు వెళుతుండగా కృష్ణాపురం గ్రామం మలుపు వద్ద ఏపీ 21 టీబీ 1025 అనే నెంబరు గల లారీ వెనుక నుంచి సైకిల్‌ని ఢీకొనడంతో సంపత్ అక్కడికక్కడు కుప్పకూలి మృతి చెందాడు. దీనిపై స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ సునీల్‌కుమార్ చరవతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యోగాసనాలతో ఆధ్యాత్మికతతో పాటు

ఆరోగ్యంపై అవగాహన

తిరుపతి, జూన్ 20 ప్రభాతవార్త:

తిరుపతినగరంలో ప్రతి శనివారం వేంకటేశ్వర స్వామిని స్తుతిస్తూ నిర్వహించే నగర సంకీర్తన కార్యక్రమం అనంతరం, నగర సంకీర్తన మండలి సభ్యులు యోగాసనాల ప్రదర్శనతో భక్తులను ఆకట్టుకున్నారు. గోవిందరాజస్వామి ఆలయం ముందు నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మికత, ఆరోగ్యం, క్రమశిక్షణల సమ్మేళనంగా నిలిచింది. యోగ గురువు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భజన మండలి సభ్యులు వివిధ యోగాసనాలను ప్రదర్శించి యోగ ప్రాముఖ్యతను చాటి చెప్పారు. యోగ ప్రతి మనిషి జీవితంలో అంతర్భాగం కావాలని, యోగ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షి ంచుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు వాసుదేవరెడ్డి, మునెప్పగారి మునినాథరెడ్డి, గుండాల గోపీనాథ్ రెడ్డి, రెడ్డిబాబు, నాగేశ్వరరెడ్డి, జైనేంద్ర, సిద్ధవరం వెంకటాద్రి, కొండే జంగారెడ్డి, మురళి, మిట్టపల్లి బ్రహ్మానందం, కన్నప్పగారి కేశవులు, నాగరాజారెడ్డి, అరుణమ్మ, జయమ్మ, పద్మావతి, సుశీల, జ్యోతి, కళ్యాణి, సిద్ధమ్మ, ఉషశ్రీ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ రంగంలో తీసుకువచ్చిన జీవోలను వెంటనే రద్దు చేయాలి

పుత్తూరు రూరల్, జూన్ 20 ప్రభాతవార్త:

ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘమైన ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు అన్ని మున్సిపల్ పట్టణ కార్యాలయాల వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో భాగంగా పుత్తూరు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో 14 కీలక విభాగాలను ప్రైవేటీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 975, 673 జీవోలను తక్షణమే ఉపసంహరించాలని, శాశ్వత స్వభావం కలిగిన విధులను నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, వివిధ మున్సిపాలిటీల్లో జరుగుతున్న లోపాలను, దుబారా ఖర్చులను, అవినీతిని నియంత్రించేందుకు పటిష్టమైన యంత్రాంగాన్ని నియమించాలని, పౌర సేవలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలి తప్ప ప్రైవేటీకరించరాదని ఆయన అన్నారు. తమసమస్యల పరిష్కారం కోంస నినాదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘోర రోడ్డు ప్రమాదం

ఇద్దరి పరిస్థితి విషమం

బైరెడ్డిపల్లి, జూన్ 20 ప్రభాతవార్త

బైరెడ్డిపల్లి మండలం జాలారిపల్లి సమీపంలో లారీ ముందర టైరు పగిలిపోవడంతో ఇందులో ప్రయాణిస్తున్న ఆరు మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు అయినవి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నదని సమాచారం. 108 నవాకారంతో క్షతగాత్రులను పలమనేరు ఏరియా ఆరోగ్య కేంద్రానికి తరలించడం అయినది.బైరెడ్డిపల్లి పోలీసు వారు దర్యాప్తు చేస్తున్నారు. ఏపీకు చెందిన ఈచర్ వాహనము అతివేగంగా రావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రమాద స్థలంలో ఉన్న వారు తెలియజేస్తున్నారు. బైరెడ్డిపల్లి ఎస్ ఐ చందన ప్రియ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి కేసు నమోదు చేయడం జరిగినది.

రెప్రజెంట్స్‌గా దొంగలు వస్తున్నారు.!

ప్రజలు అప్రమత్తంగా వుండాలి.. సిఐ సురేష్‌కుమార్

చంద్రగిరి, జూన్ 20 ప్రభాతవార్త:

దొంగల ముఠా ఒకటి రెప్రెజెంట్స్‌గా పరిచయం చేసుకుని చోరీలకు పాల్పడేందుకు వస్తున్నట్లు సిఐ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు పాకాలలో చోటుచేసుకున్న చోరీని ఉదహరించారు. పగలు రెప్రెంట్స్‌లగా తయారై రెక్కీ నిర్వహించడానికి వస్తారని అన్నారు. పగటిపూట రెక్కీ నిర్వహించి రాత్రి వేళ చోరీకి పాల్పడతారని అన్నారు. అయితే ఒంటరి మహిళ లేదా ఒంటరి వ్యక్తి వుంటున్న నివాసాలలో పగలే దాడిచేసి చోరీకి పాల్పడే అవకాశం వున్నందున ప్రజలు అప్రమత్తంగా వుండాలని అన్నారు. ఎవరైనా అనుమాస్పద వ్యక్తులు మీ ఏరియాలో తిరుగుతున్నట్లయితే వెంటనే 112 నెంబర్‌కు కాల్ చేసి చెప్పాలని అన్నారు. అదేవిధంగా గృహస్థులు ఇల్లు వదలి విహారయాత్రలకు, ఆలయ సందర్శనాలకు, బంధువుల వద్దకు వెళ్ళే సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆ మేరకు పోలీసు యాప్‌ను వినియోగించుకోవడం ద్వారా మీ ఇంటిపై పోలీసు నిఘాతో తగిన భద్రతను కల్పించే అవకాశం వుంటుందన్నారు. వీలైనంత వరకు బహిరంగ ప్రదేశాలలో గల ఒంటరి నివాసాల వద్ద, ఒంటరిగా నివశిస్తున్న వారి ఇళ్ళకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రస్తుతం సమాజాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి నియంత్రణకు పోలీసులు కట్టుబడి వున్నారనీ, ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు. మీ ప్రాంతంలో ఎవరైనా గంజాయి సేవించినా, విక్రయించినా, కలిగివున్నా తమకు తెలిజేస్తే మీ సమాచారాన్ని గోప్యంగా వుంచబడుతుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, చోరీలను అడ్డుకోవడం, గంజాయిపై ఉక్కుపాదం మోపడంలో ప్రజల భాగస్వామ్యం తప్పకవుండాలని అన్నారు.

లక్ష కోట్లతో రాయలసీమ అభివృద్ధి

అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

పలమనేరు రూరల్, జూన్ 20 ప్రభాత వార్త:

గత ప్రభుత్వం వల్ల ఆర్థికంగా దెబ్బతిన్న రాష్ట్రాన్ని మళ్ళీ ముందుకు తీసుకెళ్తూ, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. శనివారం అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం రీసర్వే పేరుతో ప్రజలలో ఒక రకమైన భయాందోళనలు గురి చేశారని, కానీ ఇప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించే అవకాశం లభించిందని అన్నారు. పలమనేరు సమీపంలోని క్యాటిల్ ఫార్మ్ వద్ద ఒక పెద్ద ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ నిర్మాణానికి 33 ఎకరాల భూమిని కేటాయించామని, త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని చెప్పారు. 2018 లో తానే స్వయంగా మంత్రిగా, శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు ఈ ప్రాంతానికి హంద్రీనీవా నీటిని తీసుకువచ్చామని గుర్తుచేశారు. చంద్రబాబు నాయుడు గారు కుప్పం వరకు నీళ్ల తీసుకువెళ్లడం వల్ల తమ నియోజకవర్గంలోని 6070 చెరువులు మొదటి దఫాలోనే నిండుకున్నాయని, బైరెడ్డిపల్లి చెరువు కూడా 60 వరకు నిండిందని తెలిపారు. మదనపల్లి, పుంగనూరు, పలమనేరు, కుప్పం, తంబళ్లపల్లి నియోజకవర్గాలకు ..2,886 కోట్ల రూపాయలతో గండికోట మరియు గాలివీడు వద్ద ప్లాంట్ ఏర్పాటు చేసి, శుద్ధి చేసిన తాగునీటిని పైప్‌లైన్ల ద్వారా ప్రతి చిన్న గ్రామానికి 24 గంటలు అందించే కార్యక్రమానికి త్వరలోనే టెండర్లు పిలవబోతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ, కూటమి నాయకులు కిషోర్ గౌడు, సుబ్రహ్మణ్యం శెట్టి, సుబ్రహ్మణ్యం గౌడు, రాంబాబు, గజేంద్ర, ఖాజా, దిలీప్ కుమార్, విజయ్ కుమార్, నాగరాజు రెడ్డి, లతోపాటు సింగిల్ విండో చైర్మన్లు డైరెక్టర్లు మరియు పలు శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కంకర క్వారీల అనుమతులకు వ్యతిరేకంగా ధర్నా

వరదయ్యపాళెం, జూన్ 20, ప్రభాతవార్త

వరదయ్యపాళెం మండలంలోని తొండంబట్టు పంచాయితీ పరిధిలో ఎం.జి నగర్, నాగనందాపురం అరుంధతివాడ సమీప ప్రాంతాల్లో కంకర క్వారీలకు రెవెన్యూ అధికారులు అనుమతులు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు చిన్నరాజ్, గ్రామ పంచాయితీ సర్పంచ్ సురేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ నాయకుడు చిన్నరాజ్ మాట్లాడుతూ, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా రెవెన్యూ అధికారులు కంకర క్వారీలకు అనుమతులు మంజూరు చేశారని ఆరోపించారు. కొందరు అధికారులు లంచాల ప్రభావంతో ప్రజా ప్రయోజనాలను పక్కనబెట్టి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. క్వారీల ఏర్పాటు వల్ల స్థానిక ప్రజల జీవన విధానంతో పాటు పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. పర్యావరణ శాఖ అధికారులు గ్రామ ప్రజల అభిప్రాయాలను సేకరించి, గ్రామ సభలు నిర్వహించిన తరువాతే నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండగా, అలాంటి ప్రక్రియలు పాటించకుండా అనుమతులు మంజూరు చేయడం దురదృష్టకరమన్నారు. కంకర క్వారీలకు ఇచ్చిన అనుమతులను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గ్రామ పంచాయితీ సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ, గ్రామంలో పారిశుద్ధ్య పనుల కోసం అని చెప్పి తన నుంచి సంతకాలు తీసుకున్నారని, అనంతరం వాటిని క్వారీల అనుమతుల కోసం ఉపయోగించారని ఆరోపించారు. తనకు పూర్తి సమాచారం ఇవ్వకుండా ఈ ప్రక్రియ చేపట్టడం బాధాకరమన్నారు. ఈ ప్రాంత ప్రజల భవిష్యత్తు, పర్యావరణ పరిరక్షణ, క్వారీల వల్ల ఏర్పడే సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని క్వారీల అనుమతులను రద్దు చేయాలని ఆయన కోరారు. ధర్నాలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి చర్యలు

– ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, జూన్ 20 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి చర్యలు చేపడతామని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శనివారం స్వర్ణాం ధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తంబిగానిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భ:గా అక్కడ చిన్నారులకు అందించే ఆహారంను పరిశీలించి స్వయంగా వడ్డించారు. చిన్నారులు, సిబ్బందికి పరిశుభ్రత, పారిశుద్ధ్యం గురించి వివరించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న సమస్యలు, విద్యార్థులకు అవసరమైన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి చిన్నారికి మెరుగైన విద్య ,పౌష్టికాహారం, పరిశుభ్రవాతావరణ ం అందించాలని సిఎం ఆదేశించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం,మాజీ ఎంపిపి డాక్టర్ వెంకటేష్, సిడిపిఒ చంద్రకళ, జనసేన నరేష్, నేతలు సురేష్‌కుమార్, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

సిఎంపిఎ శ్రీకాంత్‌చే అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కుప్పం, జూన్ 20 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు పిఎ శ్రీకాంత్ శనివారం స్థానిక మోడల్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ పిల్లలకు అందుతున్న సేవలు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు వివరించాలన్నారు. అంగన్‌వాడీ కేం ద్రంలో పిల్లలకు మరింత మెరుగైన ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కడ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, జనసేన నరేష్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి నబీ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

కడ పిడిచే రైతు బజార్‌కు స్థల పరిశీలన

కుప్పం, జూన్ 20 ప్రభాతవార్త

కుప్పంలో ఏర్పాటుకానున్న రైతు బజార్ కోసం కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ శనివారం స్థల పరిశీలన చేశారు. స్థానిక కొత్తపేట ప్రాంతంలో పాత షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు మాట్లాడుతూ కొత్తపేటలో డిఎస్పీ, ఆర్డీఓ కార్యాలయాలు తొలుత నిర్మించాలని కడ పి.డి.ని కోరారు. ఈవిషయంగా సమావేశం నిర్వహించి తగు చర్యలు తీసుకుంటామని పి.డి. సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమేష్‌బాబు, మున్సిపల్ ఎఇ ఆంజనేయులు, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పు, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులపై యువకుల దాడి.. కేసు నమోదు

కుప్పం, జూన్ 20 ప్రభాతవార్త

మండలంలోని అడవిబూదుగూరు పంచాయతీ కడచి కొటాలు గ్రామంలో గ్రామస్తులపై నలుగురు యువకులు దాడి చేయగా ఓ వ్యక్తికి తీవ్రగాయాలు అయినట్లు డిఎస్పీ పార్థసారథి తెలిపారు. గ్రామంకు చెందిన సంజయ్, విక్రమ్ అనే యువకులు మరో ఇద్దరితో కలసి గ్రామంలోని కనకస్వామి ఇంటి వద్దకు వెళ్లి అతనిపై దాడి చేయాలని తలుపులు బాదారన్నారు. అయితే కనకస్వామి ఇంట్లో లేకపోవవడంతో యువకులు తలుపులు బాదుతుండడం గమనించిన గ్రామంకు చెందిన మునస్వామి (40) వారిని వారించే యత్నం చేశాడన్నారు. దీంతో యువకులు నలుగురు తాగిన మైకంలో మునస్వామి తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచారన్నారు. గొడవలు ఆపే యత్నంలో మరికొందరిపై సైతం యువకులు దాడి చేశారన్నారు. కాగా ఇటీవలే కనకస్వామి తమ ఇంటి వద్ద తచ్చాడుతున్న సంజయ్‌ను ఇలా తిరగడం ఆపాలని దండించే యత్నంలో సంజయ్‌పై రెండు దెబ్బలు వేశాడన్నారు. అదేరోజు సంజయ్ కుటుంబీకులు కూడా కనకస్వామి ఇంటి వద్ద ఘర్షణకు దిగారని చెప్పారు. కాగా దాడి విషయంగా ముద్దాయి సంజయ్‌ను అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు చెప్పారు. మిగతా యువకులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులపై సిఎం చంద్రబాబుకు వినతి

శాంతిపురం, జూన్ 20 ప్రభాతవార్త

మండలంలోని రాళ్లబూదుగూరులో అభివృద్ధి పనులపై సిఎం చంద్రబాబునాయుడును తెదేపా నేత మణి కలిశారు. ఈసందర్భంగా చేపట్టాల్సి న పనులపై సిఎంకు వినతిపత్రం అందించారు. రాళ్లబూదుగూరులో 8కోట్లతో శ్రీ కోదండరామాలయం పునర్నిర్మాణం జరుగుతోందని ఆలయం వద్ద మండపం నిర్మాణం చేపట్టాలని సిఎంను కోరారు. అలాగే మైనార్టీల కోసం షాదీమహల్ నిర్మించాలని సిఎంను కోరగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు విద్యార్థి ఎంపిక

శాంతిపురం, జూన్ 20 ప్రభాతవార్త

స్థానిక శ్రీ పరమహంస యోగానంద విద్యాలయకు చెందిన విద్యార్థి ప్రణీత్ రాష్ట్రస్థాయి సైన్స్ ప్రాజెక్ట్ పోటీలకు ఎంపికైనట్లు యాజమాన్యం గోపాల్ జి అగర్వాల్, ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్ తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి అధ్వర్యంలో ప్రణీత్ టుఇన్‌వన్ బాటిల్ అనే ప్రాజెక్టు చేపట్టి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈసందర్భంగా అతన్ని జిల్లా సైన్స్ అధికారి మోహన్‌సింగ్, ఉపాధ్యాయులు అభినందించారు.

మాజీ ఎమ్మెల్సీచే పాఠశాల సందర్శన

శాంతిపురం, జూన్ 20 ప్రభాతవార్త

మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మండలంలోని రాళ్లబూదుగూరు జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఈసందర్భంగా అక్కడ విద్యార్థులకు అందిస్తున్న ఆహారం గురించి ఆరా తీశారు. అలాగే ఆరిముత్తనపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంను సైతం పరిశీలించారు. నేతలు మణి, రాజారెడ్డి పాల్గొన్నారు.

యోగాతో ఆత్మవిశ్వాసం..ఏకాగ్రత పెంపు

– బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్

కుప్పం, జూన్ 20 ప్రభాతవార్త

యోగాతో మనిషిలో ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత పెరుగుతుందని బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. శని వారం కుప్మపం ఇంజనీరింగ్ కాలేజ్‌లో అంత ర్జాతీయ యోగా దినోత్స వాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరానికి వ్యాయామం ఎంత ముఖ్యమో మనసుకు యోగాకూడా అంతే అవసరం అన్నారు. యోగాతో ఒత్తిడి, నిరాశ, నిస్పృహ తొలగుతాయన్నారు. యోగం చేసేవాడికి రోగం చేరదు అనే నానుడి ద్వారా యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కెఇసి వైస్‌ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ మాట్లాడుతూ యోగాలో ప్రాణాయామంకు ఉన్న విశిష్టత గురించి వివరించారు. దీనిద్వారా విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యాలు పెరుగుతాయన్నారు. ఈసందర్భంగా యోగా మాస్టర్ గణేష్ విద్యార్థులచే సుఖాసనం, ఆంజనేయాసనం, భుజంగాసనం తదితర ఆసనాలను సాధన చేయించారు. కార్యక్రమంలో సెక్రటరీ సాగర్ రాజ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరన్, లైబ్రరీ హెచ్ఒడి డాక్టర్ శరవణన్, గంగాధర్, నాగేష్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, కెడిసి వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ విమల జోసెఫ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై వేధింపులు తగదు

ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు ఆనంద్‌బాబు

పలమనేరు, జూన్ 20, ప్రభాతవార్త:

ఉద్యోగులపై వేధింపులు తగదని పలమనేరు ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు ఆనందబాబు శనివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఇటీవల పలమనేరు నియోజకవర్గం పరిధిలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కొంతమంది అధికారులు అనసరిస్తున్న తీరుపై ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమౌతోందన్నారు. ఉద్యోగులను అమర్యాదకరంగా హేళన చేయడం బానిసలుగా చూడడం వంటిఘటనలపై ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. అలాగే జనగణన వివిధ సర్వేలు ఇన్‌చార్జి బాధ్యతలు బిఎల్ఓ డ్యూటీలు వంటి శాఖేతర విధులు కేటాయింపులో సమన్వయం కనిపించడం లేదన్నారు. దీనివల్ల ఎంతో మంది మానసిక క్షోభ అనుభవిస్తున్నారని తెలిపారు. కొంతమంది ఉన్నతాధికారుల మెప్పుకోసం అత్యుత్సాహం చూపుతూ అసహజ లక్ష్యాలను నిర్దేశించడం కార్యాలయం సమయం ముగిసిన తర్వాత ఉద్యోగులను ఫోన్లు చేసి బెదిరించడం ఒత్తిడి చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఉద్యోగుల సమస్యలపై అధికారులు ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి గౌరవ ప్రదమైన వాతావరణం నెలకొల్పాలని విధుల కేటాయింపులో సమన్వయం పాటించాలని లేదంటే ఉద్యోగ సంఘాల నుండి తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

ఇంటింటి సర్వేలో బిఎల్ఓలు బిజిబిజీ

పలమనేరు, జూన్ 20, ప్రభాతవార్త:

ఓటర్ల సర్వేలో బిఎల్ఓలు బిజిబిజీగా విధులు నిర్వహిస్తున్నారు. ఒక వీధిలోకి వచ్చి ఆ వీధి గృహస్తుల ఓటరు కార్డులు తెప్పించి వాటి ఆధారంగా ఇంటింటి సర్వేలు చేస్తున్నారు. మొత్తం ఓటర్ల సంఖ్య ఇందులో మృతిచెందిన వారు. ఊరు విడచి వెళ్ళి ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారి పేరులో తొలగిస్తున్నారు. 2002 ఓటరు లిస్టు ప్రకారం ఈ కార్యక్రమాలు శనివారం మున్సిపాల్టీ పరిధిలోని 24, 26 వార్డుల్లో సర్వే పనులు జరిగాయి. పలమనేరు బాలాజీ సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్‌వి బాలాజీ, తెలుగుదేశం నాయకుడు ఖాజా తదితరులు ఈ సర్వేలో బిఎల్ఓలతో పాల్గొన్నారు. 2002లో ఓటర్లు లిస్టులో ఉన్న వారి పేర్లు భద్రంగా వున్నాయి. వారి పేర్లుతో పాటు ఫోటోలు కలిగిన ఫారాలు ఓటర్లకు అందజేసి వాటిని పూరించి ఇవ్వాలని సూచిస్తున్నారు. ఐతే వివాహమైన మహిళలు అప్పట్లో భర్త ఇంట్లో ఉండి ఓటు వేశారా లేక పుట్టింట్లో ఉండి ఓటు వేశారా అని ఆరా తీస్తున్నారు. ఒక వేళ 2002లో భర్త ఇంటి నుండి ఓటు వేయని వారు పుట్టింటిలో వుండి ఓటు వేసిఉంటే పుట్టింటి నుండి తల్లిదండ్రుల ఓటుహక్కు కలిగిన లిస్టు నుండి సీరియల్ నంబరు తీసుకొని ఇవ్వాలని సూచిస్తున్నారు. ఇక 18 ఏళ్ళు నిండి కొత్తగా ఓటు హక్కు కోసం పేర్లు నమోదు చేసుకునే వారికి ఇంకా సమయం ఉందని సూచిస్తున్నారు.

పలమనేరులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర

ప్రారంభించిన కమీషనర్ రమణారెడ్డి

పలమనేరు, జూన్ 20, ప్రభాతవార్త:

పలమనేరులో స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం కమీషనర్ రమణారెడ్డి ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం నుండి ఎంబిటి రోడ్డు. ఎద్దుల సంతవీధి వీధి, బజారు వీధి, జవిళివీధి మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఇంటి వద్ద వలె వీధుల్లోనూ పారిశుద్యం పాటించాలని, మురుగు కాలువలు తరచూ శుభ్రం చేయాలని, బ్లీచింగ్ చల్లి దోమలు నివారించాలని, అంటు వ్యాధులు నిర్మూలించాలని సూచించారు. దీని వల్ల మున్సిపాల్టీ స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రగా రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు పూర్తిగా నిషేధించాలని కాగితపు కవర్లు లేదా గుడ్డ కవర్లు మాత్రమే వాడాలన్నారు. గతంలో పలమనేరు మున్సిపాల్టీకి రెండుసార్లు స్వర్ణాంధ్ర అవార్డులు మెమెంటోలు లభించాయని ఈ సారి కూడా ఈ అవార్డు దక్కించుకోవాలని సూచించారు. పరిరక్షణ సమితి సభ్యులు, డ్వాక్రా మహిళలు మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు,

ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు

శాంతిపురం, జూన్ 20 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను శనివారం టిడిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు .పెద్ద ఎత్తున కేకును కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, మండల టిడిపి అధ్యక్షుడు ఉదయ్ కుమార్ ,కార్మిక బోర్డు సభ్యుడు విశ్వనాథ నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గోపాల్ ,నాయకులు మణి,గిరిధర్, బసవరాజు, బాలు, లోకి ,నాగరాజు, చంద్రకళ ,అనసూయ, సుగుణమ్మ ,పుష్ప ,శకుంతల తో పాటు పెద్ద ఎత్తున నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు అలాగే మండలంలో పలుచోట్ల నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను టిడిపి నేతలు నిర్వహించారు .

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

యామదరి, జూన్ 20 ప్రభాతవార్త:

యాదమరి మండలం కోణాపల్లి పంచాయతీ పరిధిలోని నర్రావూరు ఆదిఆంధ్రవాడ గ్రామంలో ప్రాథమిక విద్య అభ్యసించే 15 మంది విద్యార్థులకు కోణాపల్లి గ్రామంకు చెందిన ఆర్టీసీ కండెక్టర్ ఎస్.కుమార్, అతని సతీమణి జి.విజయలక్ష్మిలు శనివారం నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళను పంపిణీ చేశారు. నర్రావూరు ఆదిఆంధ్రవాడలో 15 మంది విద్యార్థులు ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి కోణాపల్లి గ్రామంకు చెందిన ఆర్టీసీ కండెక్టర్ కుమార్ దంపతులు 5 వేల రూపాయల విలువైన పరీక్షలకు ఉపయోగించే ప్యాడ్స్, నోటు పుస్తకాలు, జామెంటరీ బాక్స్‌లు, పెన్సిళ్ళు, పెన్నులు తదితరాలను పంపిణీ చేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా విని పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని ఈ సందర్భంగా కుమార్ దంపతులు కోరారు.

విద్యార్థులకు పాఠ్యభారం తగ్గింపు

– రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్

చిత్తూరుహెల్త్, జూన్ 20 ప్రభాతవార్త:

రాష్ట్రంలో పాఠశాల విద్యార్థులకు స్థాయికి మించి వున్న పాఠ్యభారంను తగ్గించాలని రాష్ట్ర వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డిశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 6 నుండి 10 తరగతుల వరకు కొన్ని పాఠ్యాంశాలు విద్యార్థులకు స్థాయికి మించి వుండటంతో వారు ఆందోళన చెందుతున్నారన్నారు. పునాది దశలోనే అధిక సమాచారం, క్లిష్టమైన భావం వుండటంతో విద్యార్థులకు పాఠ్యాంశాలపై ఆసక్తి వుండదని, కేవలం పరీక్షల కోసం గుర్తుంచుకనే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. అభ్యసన సామర్థాలను పరిగణనలోకి తీసుకుని విద్యార్థుల ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 6 నుండి 10 తరగతుల సాంఘీకశాస్త్ర సిలబస్‌పై సమీక్ష చేయాలని ఆయన విన్నవించారు. విద్యాశాఖ ఉన్నత అధికారులు ఈ అంశంపై అత్యవసరంగా సమీక్ష నిర్వహించి మార్పులు చేయకుంటే ఫలితాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆయన హెచ్చరించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- ఎస్వీ గ్రూప్స్ ఛైర్మన్ బిఎం దయానిధి

- ఐడిపిఎస్‌లో ఘనంగా యోగా దినోత్సవం !!

కుప్పం, జూన్ 20 ప్రభాతవార్త

నిత్య జీవితంలో యో గాను అలవాటు చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కుప్పం ఎస్వీ గ్రూప్స్ ఛైర్మన్ బిఎం దయానిధి పేర్కొ న్నారు. శనివారం కు ప్పంలోని ఇంటరే న్ష నల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో శారీరక , మానసిక ఆనందం కలుగుతు ందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, ఒత్తిడి నియంత్రణలో యోగా కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు వివిధ రకాల యోగాసనాలు, ప్రాణాయామం చేసి యోగా ప్రాధాన్యతను చాటారు.

పాడి రైతుల్ని ఆదుకోవడమే లక్ష్యం : రాజగోపాల్.

కుప్పం, జూన్ 20 ప్రభాతవార్త.

కుప్పం ప్రాంతంలో పాడి రైతులని ఆదుకునేందుకు సి ఎన్ చంద్రబాబు ప్రత్యేక చర్యలు చేపట్టారని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మిట్టపల్లి, గరిగచినేపల్లి వేపూరు తదితర గ్రామాల్లో రైతులకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 50 శాతం రాయితీతో దానా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలో పాల ఉత్పత్తిని 10 లక్షల లీటర్లకు పెంచడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారన్నారు. వెటర్నరీ ఏడి రవిశంకర్, కార్పొరేషన్ డైరెక్టర్ మణి, తెలుగు యువత అధ్యక్షుడు కనకరాజు, క్లస్టర్ ఇంచార్జ్ హైదర్ వలీ, కో ఇంచార్జ్ గాయత్రి , నాయకులు చంద్రయ్య, చలపతి, నరసింహ, రైతులు పాల్గొన్నారు

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

కాణిపాకం దేవస్థానంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ

కాణిపాకం, జూన్ 20 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ, దర్మధాయశాఖ ఆదేశాల మేరకు ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్‌ల ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మొదటగా దేవస్థానం అతిథి గృహం వద్ద ఆలయ సిబ్బందితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆలయ ఆలయ అధికారులు, సిబ్బందితో కలసి ఆలయ మాఢా వీధులు,బస్టాండు మీదుగా ర్యాలీ నిర్వహించారు.అలాగే పారిశుద్య కార్మికులతో పారిశుద య పనులు నిర్వహించారు.ఈసందర్భంగా ఆలయశుభ్రత అందరి బాధ్యత, పచ్చదనం పరిశుభ్రత ప్రగతికి సోపానాలు అంటూ నినాదాలు చేశారు. అలాగే దేవస్థానం పరిసరాల్లో పుట్‌పాత్‌లపై ఆక్రమణలను వెంటనే తొలగించాలని, పా ్లస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేదించాలని వ్యాపారస్తులను ఛైర్మన్, ఈఓలు ఆదేశించారు. ఈ కార్యాక్రమంలో ఆలయ ఏఈఓలు ధనంజయ,ఎస్వీ.కృష్ణారెడ్డి హరిమాధవరెడ్డి, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ ఏఈలు ఆలయ, పారిశుద య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐరాల యాదవ మహాసభ కన్వీనర్‌గా పెద్దరెడ్డెప్ప యాదవ్ నియామకం

ఐరాల, జూన్ 20 ప్రభాతవార్త:

అఖిల భారత యాదవ మహాసభ ఐరాల మండల కన్వీనర్‌గా ఐరాలకు చెందిన పెద్దరెడ్డెప్ప నియమితులయ్యారు. చిత్తూరు జిల్లా అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి అశోక్ ఆనంద్‌యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఐరాలలో మండల కమిటిని నియమించారు. ఈమేరకు ఐరాల మండల అధ్యక్షుడిగా ఐరాలకు చెందిన పెద్దరెడ్డెప్ప యాదవ్,ప్రధాన కార్యదరి ్శగా కాణిపాకంకు చెందిన ఎం.శరత్ యాదవ్‌లు నియమితులయ్యారు. ఈమేరకు వారికి అశోక్ ఆనందర్‌యాదవ్ నియామక పత్రాలను అందజేశారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండల యాదవుల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు ఈకార్యక్రమంలో మండలంలోని పలువురు యాదవ ప్రముఖులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత

చిత్తూరురూరల్, జూన్ 20 ప్రభాతవార్త:

రోజువారి యోగా సాధనతో శారీరక ధృడత్వం, ఒత్తిడి, ఆందోళనలు తగ్గి అద్భుతమైన మానసిక ప్రశాంతత లభిస్తుందని బృందావన్ సీనియర్ సెకండరీ పాఠశాల ప్రిన్సిపాల్ శైలజకుమారి తెలిపారు. శనివారం చిత్తూరు పట్టణం, సంతపేటలో పాఠశాల ఆవరణం నందు అంతర్జాతీయ దినోత్స వవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా పిల్లల చేత యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ప్రియతేజ, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీజాబితాలో చేర్చండి

– డెడికేటెడ్ కమీషన్‌కు వినతి

చిత్తూరురూరల్, జూన్ 20 ప్రభాతవార్త:

రజకులను షెడ్యూల్ కులాల జాబితాలో చేర్చాలని డెడికేటెడ్ కమీషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు రజక సంఘాల సమాఖ్య వ్యవస్థాపక ఛైర్మన్ పి షణ్ముగం, నగర కార్పొరేషన్ అధ్యక్షులు వెంకటేశులు వినతి పత్రం అందజేసారు. శనివారం చిత్తూరు జిల్లా కేంద్రానికి విచ్చేసిన డెడికేటెడ్ కమీషన్ ఛైర్మన్‌ను షణ్ముగం, కమిటీ సభ్యులతో వెళ్లి ఆయనను కలిసారు. భారతదేశంలో 18రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో మాత్రం రజకులను ఎస్సీ కులాల జాబితాలో వుండగా, ఆంధ్రరాష్ట్రంలో వున్న 27లక్షల మంది రజకులను మాత్రం బిసి జాబితాతో ఎందుకు వుంచారని నిలదీసారు. రజక సంఘాల తరపున గతంలో 18మంది పార్లమెంటు సభ్యులు, 112మంది శాసనసభ్యులచేత సంతకాలు చేయించి కేంద్రప్రభుత్వానికి అందజేయడం జరిగిందన్నారు. అలాగే ఎన్నికలకు ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చుతామని ఇచ్చిన హామిని ఇంతవరకు అమలు చేయలేదని వాపోయారు. డెడికేటెడ్ కమీషన్‌గా మీరు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కొన్ని సంవత్సరాలుగా పోరాడుతున్న మా సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఛైర్మన్ మాట్లాడుతూ ఈ విషయంపై ప్రత్యేకంగా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని స్పష్టమైన హామి ఇచ్చారు.

రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం భరోసా

ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

రామకుప్పం, జూన్ 20 ప్రభాతవార్త

రాష్ట్రంలోని రైతులకు కూటమి ప్రభుత్వం అండ ాగా ఉండి ఆర్థిక భరోసా ఇస్తుందని ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పిఎంకె ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, ఏఎంసీ ఛైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. శని వారం రామకుప్పం మండల కేంద్రంలో అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో రైతులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రైతులకు కేంద్రం ప్రభుత్వం నుంచి 2 వేలు రాష్ట్రం నుంచి ఐదువేల రూపాయలను రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉండి వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తున్న ఏకైక కూటమి ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు మెంబర్ శాంతారామ్, ఏపీఐఐసి డైరెక్టర్ ప్రేమ్ కుమార్, రెస్కో ఛైర్మన్ ప్రతాప్,నియోజకవర్గ టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఉదయ్ కుమార్, సుబ్రహ్మణ్యం, ఆనంద రెడ్డి,ఆంజనేయ రెడ్డి, జనసేన నరేష్, బిజెపి తులసీరామ్,జిల్లా నేత నారాయణ చారి, సీతాపతి, రామ్మూర్తి, చలపతి, చిన్న కృష్ణ, సత్యేంద్ర శేఖర్, విశ్వనాథ్, సుబ్రహ్మణ్యం, గుర్రప్ప, వెంకట్రామ గౌడు, గంట్లప్ప గౌడు, రవి రెడ్డి,రఫీ, విశ్వనాథ్, వెంకటాచలం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ ఎక్కిన టాక్సీ డ్రైవర్లు.. మాకు మీరే దిక్కు స్వామి

- నాట్ అలౌడ్ పేరుతో మా కడుపులు కొట్టకండి

తిరుపతి హెల్త్, జూన్ 20, ప్రభాతవార్త

తిరుపతి తిరుమల టాక్సీ డ్రైవర్ల సమస్యలపై రోడ్డెక్కిన టాక్సీ కార్మిక యూనియన్ సంఘాలు.తిరుమలకి నిత్యం వేలాది మంది భక్తులు వెంకటేశ్వర స్వామి దర్శనానికి వస్తుంటారని, టాక్సీ డ్రైవర్లు వాళ్ళ జీవనాధారంగా భక్తుల్ని తిరుమలకు,వివిధ ప్రాంతాల గుడులకి, తీసుకెళ్లే నేపథ్యంలో తిరుమలగిరి టాక్సీలను వివిధ రకాలుగా పోలీసులు,విజిలెన్స్ సిబ్బంది,ఇబ్బందులకు గురిచేసి, నాట్ అలోడ్ పేరుతో డ్రైవర్ల జీవనాధారంపై, కడుపు కొడుతున్నారని, వారి బ్రతుకు తెరువు మీద దెబ్బ కొట్టేలా టీటీడీ యంత్రాంగం మరియు విజిలెన్స్ విభాగం చేస్తున్నారని ఆరోపించారు. రోడ్డు ఎక్కిన టాక్సీ కార్మికులు టీటీడీ పరిపాలన భవనం వద్ద శ్రీ కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, టాక్సీ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఏడుకొండలవాడిని మొక్కుకున్నారు. మాకు నీవే దిక్కు గోవిందా అంటూ నినాదాలు చేస్తూ, మా సమస్యకు పరిష్కారాన్ని చూపమని వేడుకొన్నారు. తిరుపతి టీటీడీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కార్మిక లీడర్ రాజేష్ యాదవ్ నేతృత్వంలో తిరుపతిలోని 18 యూనియన్ సంఘాల నాయకులు,డ్రైవర్లు,పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాలమురళీకృష్ణ, వాసు,

నారావారి ఇంటి ఇలవేల్పు భువనమ్మ

టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి..

భారీగా కేక్ కటింగ్ మరియు రక్తదాన శిబిరం

రైల్వేకోడూరు రూరల్, జూన్ 20 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటి ఇలవేల్పు నారా భువనేశ్వరమ్మా అని రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి దంపతులు అన్నారు. శనివారం రైల్వేకోడూరు మండలంలోని రాఘవ రాజాపురం టిడిపి కార్యాలయంలో నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో హెరిటేజ్ కంపెనీ పెట్టి నీతి నిజాయితీగా సంస్థను కాపాడుకుంటూ ఉన్నత భావాలను కలిగి నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో నారా భువనేశ్వరి ఎంతో ఉన్నత కీర్తిని పొంది వున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబును గత ప్రభుత్వంలో జైలు పాలు చేయడంతో అప్పటినుండి భువనమ్మ ఉన్నత మనసుతో రాజకీయ ప్రభావాలను అంచలంచలుగా చేపట్టి రాష్ట్రంలో ఒక సంచలన మహిళ శక్తిగా ఎదిగారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా చంద్రబాబు నాయుడు రాజకీయాలలో ఉంటే సంసార బరువు బాధ్యతలను భుజస్కందాల పైన వేసుకొని, పారిశ్రామిక దిగ్గజంగా ఎదిగారన్నారు. రైల్వే కోడూరు ప్రజలు భువనేశ్వరి జన్మదినాన్ని పురస్కరించుకొని దాదాపు 150 మంది రక్తదాన శిబిరంలో పాల్గొనడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి ముక్కా వరలక్ష్మమ్మ, డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్, కోడూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి, రాష్ట్ర టిడిపి యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి, తల్లెం రమణారెడ్డి, గడికోట సుబ్బరాయుడు, కంద్రిక చంద్రరాజు, సురపు రాజు పల్లి మాజీ సర్పంచ్ సుబ్బరాజు, క్లస్టర్ ఇంచార్జ్ పటాన్ మోలా, పట్టణ అధ్యక్షుడు పోకల మణి, తిప్పన రాజశేఖర్, పసుపులేటి జయచంద్ర, ముంతాజ్ మెహతాజీ బేగం, మాజీ సర్పంచ్ పుష్పలత, భుజంగేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ ఉంగరాల సురేంద్ర కుమార్, కొప్పరపు అరవింద్, గంగరాజు వెంకటేశ్వరరాజు, డి కృష్ణంరాజు, దాది వాండ్లపల్లి చిట్టి, మల్లికార్జున రెడ్డి, మాధవరం పోడు శేఖర్ రాజు, పందేటి వెంకటరామరాజు, మద్దినగిరి, శివయ్య, అకేపాటి సుకుమార్ రెడ్డి, రామరాజు, తిరుపతి శేఖర్, సుబ్బరామిరెడ్డి, ముని పెంచల్ రెడ్డి, పరుశురాం రెడ్డి, సిద్ధిరాంరెడ్డి తోపాటు కూటమికి చెందిన నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొని కేకును పంచి పెట్టారు.

పోలేరమ్మ జాతరలో ముక్కా వరలక్ష్మి

ఓబులవారిపల్లి, 20 జూన్ ప్రభాతవార్త

ఓబులవారిపల్లి మండలం అప్పుగుంటపల్లి గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి జాతరలో కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యి అమ్మవారికి పూజలు నిర్వహించారు అనంతరం భక్తులతో ముచ్చటించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అన్ని విధాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పుకుంటపల్లి గ్రామస్తులు గ్రామ పెద్దలు మరియు నాయకులు శనివారం మల్లికార్జునెడ్డి సురేంద్ర వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులు పరిరక్షణే అధికారుల ధ్యేయం

ఓబులవారిపల్లి, 20 జూన్ ప్రభాతవార్త

ఓబులవారిపల్లి మండలంలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ధ్యేయంగా ప్రభుత్వ అధికారులు పనుచేయాలని ఓబులవారిపల్లి ఇన్చార్జి తాసిల్దార్ సిద్దేశ్వర రావు అన్నారు శనివారం స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో ఓబులవారిపల్లి ఎస్సై సృజన్ కుమార్, రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ముఖ్యంగా చెరువు మట్టి తరలింపు ప్రభుత్వ భూములు ఆక్రమణ వాగులు వంకలు చెరువులు ఆక్రమించకుండా అధికారులు అన్ని విధాలా చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆస్తులను అలాగే ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టకుండా చర్యలు తీసుకోవాలని ఆయన పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అంతేకాకుండా పెద్ద వరంపాడు. వై కోట. జిల్లేడు మదక బోటు మీద పల్లి తదితర పంచాయతీలో ఉన్న చెరువుల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండు కొడుతున్నారన్నారు. అలాగే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జూదం. పేకాట, కోడి పందాలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సుజన్ కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మల్లికార్జునరెడ్డి, ఓబులవారిపల్లి మండల వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

రేపు కుప్పంలో జాబ్ మేళా - ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్

కుప్పం, జూన్ 20 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పంలో ఈనెల 22వతేది వివిధ పరిశ్రమల ప్రతినిధులచే జాబ్ మేళా కార్యక్రమంను కడ మీటింగ్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. స్థానిక పొగురుపల్లి పారిశ్రామికవాడలో త్వరలో ప్రారంభం కానున్న ఎబిఐఎస్ ప్రోటీన్స్ సంస్థ, శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ సంస్థ, ఏస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థల్లో పనిచేసేందుకు గాను నిరుద్యోగ యువతకు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతోందన్నారు. సోమవారం ఉదయం 10గంటలనుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రైతులసంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయం

- ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి

బైరెడ్డిపల్లి, జూన్ 20 ప్రభాతవార్త

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయం అని ఎమ్మెల్యే అమర నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల కార్యాలయం వద్ద నిర్వహించిన అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ సభలో ఆయన పాల్గొని ప్రస ంగిం చారు. నాలుగు జిల్లాలకు కోట్ల రూపాయల వ్యయంతో వాటర్ గ్రిడ్‌లను గాలివీడు ప్రాంతంలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. మామిడి రైతులను ఆదుకునేందుకు కిలోకు 4రూ.లు ప్రోత్సాహకంగా సిఎం చంద్రబాబు నాయుడు అందిస్తున్నారన్నారు. హంద్రీ-నీవా జలాలను చిత్తూరు జిల్లాకు తేవడంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలు అద్వితీయమన్నారు. ఐదేళ్ల వైకాపా పాలనలో రైతులను పట్టించుకోలేదని పేర్కొన్నారు. ప్రతి చెరువుకు నీరు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రైతులకు బిందుసేద్యం పథకాలు రాయితీతో అందిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా ప్రభుత్వం రైతు సంక్షేమంకు కృషి చేస్తోందన్నారు. సమావేశంలో ఎఎంసి ఛైర్మన్ రాజన్న, జిల్లా ఉపాధ్యక్షుడు రామచంద్రనాయుడు, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, కూటమి నేతలు, రైతులు పాల్గొన్నారు.

నేడు పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం

చిట్వేలి, జూన్ 20 ప్రభాతవార్త:

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు చిట్వేలి మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. శనివారం తాను మాట్లాడుతూ ఉదయం 6 నుంచి 7 గంటల సమయంలో ప్రతి గ్రామంలోని సచివాలయం పరిధిలో యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల నందు ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టుతున్నామని తెలిపారు. అధికారులు, ప్రజలు, విద్యార్థులు, ఉత్సాహకులు ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని, యోగ విశిష్టతను తెలుసుకోవాలని, అందరూ ఆహ్వానితులేనని ఎంపీడీవో అన్నారు.

పంచాయతీ గది అద్దెకు వేలం పాట.

చిట్వేలి, జూన్ 20 ప్రభాతవార్త: చిట్వేలి గ్రామపం చాయతీలోని వైయస్సార్ విగ్రహం వద్ద ఉన్న పంచాయతీ గదిని అద్దెకు ఇచ్చేందుకు జూన్ 24 బుధవారం ఉదయం పంచాయతీ ప్రాంగణం నందు వేలం పాట పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి పాణ్యం రమణయ్య తెలియపరిచారు. ఆసక్తి గలవారు జూన్ 23 సాయంత్రం లోపల 15000 డిపాజిట్ నగదుతోపాటు, ఒక లక్ష రూపాయల షూరిటీ ఇవ్వాలన్నారు. వేలం పాట అధికంగా పాడిన వారికి గదిని ఖరారు చేస్తామని 2027 మార్చి 31 వరకు వ్యాపార అవసరాలకు ఉపయోగించుకోవచ్చుని తెలిపారు. మరింత సమాచారం కోసం పంచాయతీ సిబ్బందిని సంప్రదించవచ్చని కార్యదర్శి రమణయ్య తెలియపరిచారు.

శ్రీవారి ఆలయం ముందు

కొరవడిన ప్రశాంతత -ప్రైవేట్ ఫోటోగ్రాఫర్ల హడావిడితో భక్తుల అసహనం

ప్రభాతవార్త-తిరుపతి

:పవిత్రతకు నిలయమైన తిరుమల పుణ్యక్షేత్రంలో అడుగడుగునా భక్తిభావం ఉట్టిపడేలా చూడటంలో టిటిడి అధికారులు, పోలీస్, విజిలెన్స్ పాత్ర ఎంతైనా ఉంది. ఎంతో భక్తివిశ్వాసాలతో ఆలయంలోపల నుండి వెలుపలకు వచ్చిన భక్తులు ఆలయానికి ఎదురుగా అఖిలాండం వద్దకు చేరుకునేలోపు భక్తులను ఫోటోలతో పేరుతో హాకర్లు చుట్టుముట్టి ఫోటోలు తీయించుకోవాలని హడావిడి చేస్తున్నారు. అసలు ఇక్కడ ఎంతమంది ప్రైవేట్ ఫోటోగ్రాఫర్లకు అనుమతి ఉందో లేదో అనేది కూడా అటు పోలీస్ ఇటు విజిలెన్స్ విభాగం అధికారులు తేల్చలేకపోతున్నారు. ఆలయానికి సమీపంలోనే ఉన్న ఈ అఖిలాండం, బేడి ఆంజనేయస్వామి ఆలయాల పరిసరాల్లో ఏకంగా పాదరక్షలు వేసుకుని ఈ ప్రైవేట్ హాకర్ ఫోటోగ్రాఫర్లు హంగామా చేస్తున్నా విజిలెన్స్ సెక్యూరిటీ సిబ్బంది నివారించడంలో విఫలమవుతున్నారు. రోజువారీగా మామూళ్ళు తీసుకుని ఈ ప్రైవేట్ ఫోటోగ్రాఫర్లకు చేతినిండా పనికల్పిస్తున్నారనేది దేవుడెరిగిన నిజం. పదుల సంఖ్యలో ప్రైవేట్ ఫోటోగ్రాఫర్లు, నామాలు వేసే హాకర్లు, దండలు, దేవుని చిత్రపటాలు తదితరాలు అమ్ముకునే అనధికార హాకర్ల గోల కూడా ఎక్కువైంది. మరీ వారాంతం, భక్తుల రద్దీ పెరిగిన సమయాల్లో ఆలయం ముందు ఈ ప్రైవేట్ ఫోటోగ్రాఫర్ల హడావిడి చెప్పనలవికాదు. ఏకంగా భక్తులను గుమికూడి ఫోటోలతో పేరుతో భక్తులను ఇబ్బందికి గురిచేస్తుండటం మరీ విశేషం. ఆలయం పరిసరాల్లో అనధికార హాకర్లను కట్టడిచేయడంలో విజిలెన్స్ పూర్తిగా వైఫల్యమైందని భక్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అనధికార హాకర్లనుఆలయంముందు నుండి దూరం చేయాల్సిన అవసరం ఉందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

ఎస్వి వైద్య కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ

తిరుపతి హెల్త్, జూన్ 20, ప్రభాతవార్త స్వచ్ఛాం ధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ఎస్ వి వైద్య కళాశాల ప్రాంగణంలో అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవి ప్రభు ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పిలుపు మేరకు వైద్య విద్యార్థుల చేత, వైద్య అధ్యాపకులు చేత, వైద్య సిబ్బంది, మరియు పారిశుద్ధ్య కార్మికుల చేత స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర వైద్య విద్యార్థులు, వైద్య సిబ్బంది ద్వారా ప్రతిజ్ఞ చేయించి, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య కళాశాల అధ్యక్షులు మాట్లాడుతూ పరిశుభ్రత, స్వచ్ఛత గురించి ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని, పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధించే సంకల్పానికి కట్టుబడి ఉండాలని, తద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన, ఆనంద కరమైన సమాజ నిర్మాణానికి దోహదపడాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, చెత్తాచెదారాలను రోడ్ల మీద, బహిరంగ ప్రదేశాలలో, మురికి కాలువల్లో పడేయకుండా చెత్త బుట్టలను ఉపయోగించాలని, ఇంటి పరిసరాల్లో, వైద్య విద్యార్థుల వసతి గృహాల్లో, మురికి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. అనంతరం వైద్య కళాశాల, వసతి గృహాల నందు, పరిసరాల్లో ఉన్న చెత్తాచెదారాలను తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్లు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డి.ఎస్.ఎన్ మూర్తి, సామాజిక వైద్య విద్య విభాగ అధిపతి డాక్టర్ సిరిగిరి సునీత, సామాజిక వైద్య విభాగ వైద్య అధ్యాపకులు, యూజీ, పిజి వైద్య విద్యార్థులు, వైద్యసిబ్బంది, పారిశుద్ధ్యకార్మికులు, ఎస్వీవైద్యకళాశాల పిఆర్ఓ వీర కిరణ్ తదుతరులు పాల్గొన్నారు.

జిల్లాలోని వైద్యశాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ ఎంఈయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిబాబు

తిరుపతి హెల్త్, జూన్ 20, ప్రభాతవార్త: తిరుపతి శ్రీవేంకటేశ్వర వైద్య కళాశాల, ఎస్వి ఆర్ఆర్ ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రి, ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల, జిల్లాలోని వైద్య ఉద్యోగుల సమ స్యలు ఎజెండాలో చేర్చి పరిస్కరించాలని ఏపీ ఎం ఈ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిబాబు వినతిపత్రం సమర్పించి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు తిరుపతి జిల్లా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్‌లో తాను పాల్గొని వైద్య రంగంలోని సమస్యలుపై చర్చించామన్నారు. అందులో భాగంగా తిరుపతి జిల్లాలో ఖాళీగా ఉన్న ఆఫీస్ సుబర్డినేట్, జిడిఏ , పారామెడికల్, నర్సింగ్, ఎంఎన్ ఓ, ఎఫ్ ఎన్ ఓ /ఇతర పోస్టులను భర్తీ చేయాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి ప్రతి నెల రెండవ శుక్రవారం సంబంధిత అధికారులు వద్ద జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని, యూనియన్ ఆఫీస్ బేరర్ కి సమస్యలు విన్నపం చేయడానికి హెచ్ డి ఎస్ మీటింగ్ లో పాల్గొనడానికి అనుమతి ఇవ్వాలని ఆయన కోరారు. అలాగే ఏపీసిఓఎస్ లో నియామకం పొందిన ల్యాబ్ అటెండెంట్, డి ఎస్ ఇతర ఉద్యోగులు పెండింగ్ ఉతాలు చెల్లించాలని, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 1 పోస్టు మంజూరు కొరకు ప్రభుత్వం నకు ప్రతిపాదనలు పంపాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చీఫ్ రేడియోగ్రాఫర్ , చీఫ్ పిఆర్ ఓ పోస్టు మంజూరు కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలని కోరారు. ఫార్మసీ, ల్యాబ్, నర్సింగ్ విభాగాలలో ఈ హాస్పిటల్ నమోదు కొరకు డేటా ఎంట్రీ ఆపరేటర్ లను నియమించాలని, డిఏ పాత బకాయిలు ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్. వి వైద్య కళాశాల ఉద్యోగులు కు వారి అకౌంట్ లో జీపీఎఫ్ ఖాతాలో జమ కాలేదన్నారు. తమరు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్లో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు చెల్లించాలి. పెండింగ్లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల 100 శాతం వేతన బిల్లు చెల్లించాలని, ఎస్వి ఆర్ ఆర్ జి జి ఆసుపత్రిలో పని చేస్తున్న ఫార్మసీ ఆఫీసర్, ఎల్‌టి, ఎల్ఎలకు రెగ్యులరైజషన్, ప్రొబేషన్ డిక్లరేషన్ ఆర్డర్ ఇవ్వాలని కోరారు. అందువల్ల ఈ సమస్యలను పరిశీలించి జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎంఈయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. గిరిబాబు, తిరుపతి ఎస్వి ఆర్ఆర్ జిజిహెచ్ బ్రాంచి అధ్యక్షులు వి ఆర్ మోహన్, కోశాధికారి కే. మురళి పాల్గొన్నారు.

స్విమ్స్ బ్లడ్ సెంటర్ విభాగం వారి ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం

తిరుపతి హెల్త్, జూన్ 20, ప్రభాతవార్త

శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) బ్లడ్ సెంటర్ విభాగం ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్, అమరావతి సర్కిల్ తిరుపతి నందు శనివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరంను విజయవంతం నిర్వ హించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి దివంగత నేత జాతీయ స్థాయి నాయకులు తారకనాథ్ 22వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంను ఉద్దేశించి ఆర్గనైజర్ మర్తిగారు మాట్లాడుతూ రక్తదాన శిబిరం నిర్వహించుటకు అంగీకరించిన స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ రక్తదానంకు బ్యాంక్ ఎంప్లాయిస్ స్టాఫ్ యూనియన్ వారు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసినట్లు తెలిపారు. స్విమ్ బ్లడ్ సెంటర్ విభాగాధిపతి డా. శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిభిరంలో బ్లడ్ బ్యాంక్ వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొని 110 మందికి బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు నిర్వహించగా అందులో 100 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ బ్లడ్ సెంటర్ డా. సురేష్ బాబు, డా. జయశ్రీ, స్టాఫ్ నర్సులు రమాదేవి, వై.వరలక్ష్మి, టెక్నిషియన్లు శోభారాణి, అనిత, ఎం.ఎస్.డబ్ల్యూ బి. శ్రీదేవి, బిఎస్ఇఎంఎల్‌టి స్టూడెంట్స్ ఉమామహేశ్వరి, లోకేశ్వరి తదితరలు పాల్గొన్నారు.

చెన్నై లవ్ స్టోరీ చిరస్థాయిగా నిలుస్తుంది: కిరణ్ అబ్బవరం

తిరుపతితో చెన్నై లవ్ స్టోరీ కి ప్రత్యేక అనుబంధం

మ్యూజికల్ ఫెస్ట్‌లో సందడి చేసిన చిత్ర బృందం

తిరుపతి విద్య జూన్ 20 ప్రభాత వార్త

తన సినీ ప్రయాణంలో తిరుపతికి ప్రత్యేక స్థానం ఉందని, చెన్నై లవ్ స్టోరీ ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే చిత్రంగా మారుతుందని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. తిరుపతిలో నిర్వహించిన చెన్నై లవ్ స్టోరీ మ్యూజికల్ ఫెస్ట్‌లో ఆయన మాట్లాడారు. గత మూడు సంవత్సరాలుగా దేవుడి అనుగ్రహం, అభిమానుల ప్రేమ తనకు ఎంతో బలాన్నిచ్చాయని, ప్రస్తుతం ఎంతో సంతోషంగా ఉన్నానని తెలిపారు. సినిమా విడుదలకు ముందే తిరుపతిలో భారీ స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సినిమా నిర్మాతలు, దర్శకుడు, సాంకేతిక బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రమోషన్ల విషయంలో ఎలాంటి రాజీ పడకుండా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లాలనే తపన నిర్మాతల్లో కనిపిస్తోందని కొనియాడారు. దర్శకుడు రవి నంబూరి గురించి మాట్లాడుతూ, ఆయన రచించిన అనేక సన్నివేశాలు తన వ్యక్తిగత జీవితానికి దగ్గరగా అనిపించాయని చెప్పారు. ముఖ్యంగా జిగితారా పాటకు ముందు వచ్చే సన్నివేశం ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పించి, కళ్లలో నీళ్లు తెప్పించేంత భావోద్వేగాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. సంగీత దర్శకుడు మణిశర్మ గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, చిన్నప్పటి నుంచి ఆయన సంగీతం వింటూ పెరిగానని, ఇప్పుడు తన సినిమాకు ఆయన సంగీతం అందించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రేమకథా చిత్రాలకు ఆయన అందించే నేపథ్య సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తుందని చెప్పారు. పాటల రచయిత అనంత్ శ్రీరామ్ అందించిన సాహిత్యం చిత్రానికి మరింత బలాన్ని చేకూర్చిందని తెలిపారు. సినిమా చూసిన తర్వాత కూడా ప్రేక్షకులు పాటలను మర్చిపోలేరని అన్నారు. కథానాయిక గౌరీప్రియ నటనపై ప్రశంసలు కురిపిస్తూ, రెండో భాగంలో ఆమె నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందని చెప్పారు. ఈ సినిమా ఆమెకు మరింత గుర్తింపును తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అభిమానుల ప్రేమ తనకు ఎప్పుడూ బాధ్యతను గుర్తుచేస్తుందని, మరింత కష్టపడి మంచి సినిమాలు చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నానని కిరణ్ అబ్బవరం తెలిపారు. తిరుపతి ప్రేక్షకుల ప్రేమ తనకు ఎప్పటికీ ప్రత్యేకమని పేర్కొన్నారు. చివరగా, చెన్నై లవ్ స్టోరీ సాధారణ సినిమా కాదని, విడుదలైన తర్వాత కూడా చాలా కాలం పాటు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే చిత్రంగా మారుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

తిరుపతి డివిజన్

శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా యోగా దినోత్సవం

తిరుపతి విద్య, జూన్ 20, ప్రభాతవార్త

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శ్రీ రామ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్, తిరుపతికి చెందిన అష్టాంగ యోగ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా శిక్షకుడు ఎస్. అమర్నాథ్ ఆధ్వర్యంలో వివిధ యోగాసనాలు, ప్రాణాయామాలు నిర్వహించారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, ఏకాగ్రత, క్రమశిక్షణ మరియు సానుకూల ఆలోచనా విధానం పెంపొందుతాయని వక్తలు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. జయచంద్ర మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. అలాగే, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరమని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎన్. వాసు, నిర్వాహకులు డా. కె. స్వప్నసుధ, యెస్. చక్రి శ్రీధర్, జి. చంద్రకళ, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు యోగా పట్ల ఆసక్తి, క్రమశిక్షణ మరియు సానుకూల జీవన విధానాన్ని ప్రోత్సహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

2026 నవోదయ ఫలితాల్లో విశ్వం విజయదుందుభి

- 69 మంది విద్యార్థులతో రాష్ట్రంలో మరోసారి సత్తా చాటిన విశ్వం

తిరుపతి విద్య, జూన్ 20, ప్రభాతవార్త 2026-2027 విద్యా సంవత్సరానికి నిర్వహిం చిన జవహర్ నవోదయ విద్యా లయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తిరుపతి విశ్వం విద్యా సంస్థలు మరోసారి అద్భుత విజయాన్ని నమోదు చేశాయి. ఇప్పటికే విడుదలైన ప్రథమ, ద్వితీయ జాబితాలతో పాటు తాజాగా విడుదలైన మూడవ జాబితాలోనూ విశ్వం విద్యార్థులు అత్యధిక సంఖ్యలో ఎంపికై సంస్థ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి చేర్చారు. శనివారం విడుదలైన మూడవ జాబితాలో పద్మిని, చైతన్య నాయక్, ఇందు, బద్రీనాథ్, శాంతికుమారి, గోమతి, హర్ష, నవనీష్, భావన, సుహాన్ తదితరులు జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశానికి అర్హత సాధించారు. వీరితో పాటు ప్రథమ, ద్వితీయ జాబితాల్లో ఎంపికైన కే. గీతిక, సి. కార్తీక్ శ్రీహాన్ రెడ్డి, పి. నిశాంత్, సి. హేమతేజ, హెచ్. అనన్య, ఎం. భావదీష్, ఆర్. నికోలస్ ఫ్రాంక్లిన్, కే. సిద్ధార్థ, బి. సాయి అభిరామ్, బి. హనీశ్రీ, ఎస్.ఎం. ఇలియాస్, కే. సాయి కృష్ణ, లిఖిత, జోషిక, శ్రావ్య, రిచిత, ప్రవీణ్, గగన్ హర్ష, గణేశ్, హర్షిత, తనుష, కావ్య, అస్మా, వరుణ్ సందేశ్, చరితార్థ, ప్రీతం, తేజస్వి, శ్రీదేవి తదితరులతో కలిపి మొత్తం 69 మంది విద్యార్థులు 2026-2027 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశానికి ఎంపికైనట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 36 సంవత్సరాలుగా సైనిక్ స్కూల్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ తదితర జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు విశ్వం విద్యా సంస్థలు ప్రత్యేక శిక్షణ అందిస్తూ వేలాది మంది విద్యార్థులను ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశింపజేస్తున్నాయని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, శాస్త్రీయ ప్రణాళికతో కూడిన బోధన, క్రమశిక్షణతో కూడిన శిక్షణ, ప్రత్యేక పరీక్షా విధానం, నిరంతర మూల్యాంకన పద్ధతులు, ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ వంటి అంశాలే విశ్వం విజయాలకు ప్రధాన కారణాలని ఆయన వివరించారు. నవోదయ ప్రవేశ పరీక్షల్లో వరుసగా సాధిస్తున్న ఈ విజయాలు సంస్థ నాణ్యమైన శిక్షణకు నిదర్శనమని పేర్కొంటూ, విజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు. అలాగే, 2026-2027 విద్యా సంవత్సరానికి నవోదయ, సైనిక్ మరియు ఇతర రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ పొందదలచిన విద్యార్థుల తల్లిదండ్రులు మరిన్ని వివరాల కోసం 8688888802, 9399976999 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ఆరోగ్యానికి యోగా - ప్రకృతికి మొక్కలు

గీతం విద్యాసంస్థల్లో వినూత్న కార్యక్రమం

తిరుపతి విద్య, జూన్ 20, ప్రభాతవార్త అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పుర స్క రించుకుని గీతం విద్యా సంస్థల్లో యోగా కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వ హిం చారు. ఈ సందర్భంగా వి ద్యార్థులకు యోగా ప్రాము ఖ్య తను తెలియ జేస్తూ పలు యోగాసనాలను ప్రదర్శిం చారు. ప్రముఖ యోగా గు రువు డి. కుమార్ విద్యార్థు లకు యోగా వల్ల కలిగే శారీరక, మానసిక ప్రయోజనాలను వివరిస్తూ, ఆరోగ్యకరమైన జీవనశైలికి అవసరమైన పలు యోగా ఆసనాలను నేర్పించారు. ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం పెంపొందుతాయని తెలిపారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా. ఎం.ఎస్. దేవి, రీసెర్చ్ ఆఫీసర్, ఇన్‌చార్జ్ రీసెర్చ్ యూనిట్, తిరుపతి విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేస్తూ గ్రీన్ రివల్యూషన్ సందేశాన్ని అందించారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గీతం విద్యాసంస్థల కరస్పాండెంట్ డా. తమ్మినేని వెంకటేశ్వర్లు, చైర్‌పర్సన్ పాలేటి విజయకుమారి పాల్గొని యోగా ప్రాముఖ్యతతో పాటు పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. యోగా ద్వారా ఆరోగ్య పరిరక్షణ, మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ సంరక్షణ అనే ద్వంద్వ లక్ష్యాలతో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో మంచి చైతన్యాన్ని కలిగించిందని నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం: టీటీడీ డీఈఓ

తిరుపతి విద్య, జూన్ 20, ప్రభాతవార్త తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల (టీటీడీ)ను టీటీడీ నూతన డీఈఓ డి. ఫణి కుమార్ నాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా. సి. భువనేశ్వరితో కలిసి తరగతి గదులను సందర్శించి విద్యార్థినులు, అధ్యాపకులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా టాపర్లను ప్రత్యేకంగా అభినందించిన ఆయన, 93 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే అత్యధిక డిమాండ్ ఉన్న కళాశాలగా శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల గుర్తింపు పొందిందని తెలిపారు. ఇలాంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో సీటు లభించడం విద్యార్థినుల అదృష్టమని, టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని కళాశాలకు, టీటీడీ సంస్థకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. విద్యార్థినులతో జరిగిన ముఖాముఖి సమావేశంలో వారు కోరిన పలు అదనపు సదుపాయాలను టీటీడీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా వసతి గృహంలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం కళాశాల పురోగతి గురించి ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకున్న ఆయన, అవసరమైన నూతన భవనాలు, అదనపు కోర్సుల ఏర్పాటుకు సంబంధించిన అంశాలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినుల తల్లిదండ్రులతో కూడా ఆయన మాట్లాడారు. నాణ్యమైన విద్య, భద్రత, అనుకూలమైన విద్యా వాతావరణం, కళాశాల నిర్వహణ తీరు తమకు నచ్చడంతోనే సుదూర ప్రాంతాల నుంచి తమ పిల్లలను ఇక్కడ చేర్పిస్తున్నామని తల్లిదండ్రులు తెలిపారు. టీటీడీ జేఈఓ, కార్యనిర్వహణాధికారులతో చర్చించి వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తానని డీఈఓ డి. ఫణి కుమార్ నాయుడు తెలిపారు.

కార్పొరేట్ కళాశాలకు ధీటుగా విద్యా ప్రమాణాలు

సూళ్లూరుపేట, జూన్ 20 ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్ కళాశాలకు దీటుగా విద్యా ప్రమాణాలను పెంపొందిం చేందుకు కృషి చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లను విద్యార్థులకు పంపిణీ చేసే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్యా రంగంలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పేం దుకు అవిశ్రామంగా కృషి చేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేసి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులుచేరి మంచి ఫలితాలను తీసుకొచ్చే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నా యన్నారు. అనంతరం కళాశాలలో ఇటీవల పూర్వపు విద్యార్థులచే అందజేసిన కంప్యూటర్ల అధునాతన ల్యాబ్‌ను ఆమె పరిశీలించారు. జూనియర్ కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. విద్యార్థులకు విద్యామిత్ర కిట్లను పంపిణీ చేసి, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాలలోని విద్యార్థులతో కలిసి డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకం కింద అందిస్తున్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తిరువూరు సుధాకర్‌రెడ్డి, మేడసాయి నారాయణ, కట్టబోయిన వెంకటేష్ యాదవ్, ఇవి సురేష్, పామూరు మునిస్వామి, బొమ్మన పళని, కె.శ్రీధర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి!

తడ, జూన్ 20 ప్రభాతవార్త: తడ రైల్వేస్టేషన్‌లో శనివారం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు మొదటి నెంబర్ ప్లాటుఫాం నుండి రెండో నెంబర్ ప్లాట్ ఫామ్ కు వెళుతున్న క్రమంలో సుమారు 30 నుండి 35 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తిని విజయవాడ నుండి చెన్నై వెళ్లే పినాకిని రైలు ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నది మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవ వేడుకలు

తడ, జూన్ 20 ప్రభాతవార్త: తడ మండలం రెవెన్యూ కార్యాలయంలో శనివారం తహసిల్దార్ రవికుమార్ అధ్యక్షతన రెవెన్యూ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసిల్దార్ రవికుమార్ రెవెన్యూ ఉద్యోగులకు రెవెన్యూ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించి విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలని ఎమ్మార్వో సిబ్బందిని కోరారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో విశిష్ట సేవలు అందించి పదవి విరమణ చేసిన మాజీ రెవెన్యూ అధికారి ఏడుమలైను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాంబట్టు సబ్ స్టేషన్ పరిధిలో కరెంటు కష్టాలు

తడ, జూన్ 20 ప్రభాతవార్త: ప్రస్తుతం భానుడు నిప్పులు చెలరేగుతున్న వేళ, మాంబట్టు సబ్ స్టేషన్ పరిధిలో అప్రకటిత విద్యుత్ కోతలు సామాన్య ప్రజల ప్రాణాలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి కనీస సమాచారం ఇవ్వకుండా గంటల తరబడి విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తుండ డంతో ప్రజలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటు న్నారు. రాత్రి వేళల్లో కూడా ఆకస్మాత్తుగా విద్యుత్ సరఫరా ఆగిపోతుండడంతో దోమల బెడదతో పాటు ఉక్కుపోతతో వృద్ధులు రోగులు చిన్నపిల్లలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు నిత్యం పది నిమిషాల కొకసారి కరెంటు తీస్తూ నరకం చూపిస్తున్నారు కనీసం సమాచారం తెలుసుకుందామని ఫోన్ చేస్తే సబ్ స్టేషన్ అధికారులు సిబ్బంది ఫోన్ నెంబర్లు పనిచేయకపోవడం లేదా వారు స్పందించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు కరెంటు అంతరాయంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు వెంటనే సంబంధిత అధికారులు స్పందించి అప్రకటిత విద్యుత్ కోతలను అరికట్టాలని ముందస్తు సమాచారంతో విద్యుత్ కోతలు విధించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

నారాయణ విద్యాసంస్థలో ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు

నాయుడుపేట, జూన్ 20 ప్రభాతవార్త: నారాయణ విద్యాసంస్థలో ఫాదర్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్న నాయుడుపేట సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శివశంకర్ రావు, ఏజీఎం నూర్‌రియాజ్ లు మాట్లాడుతూ తండ్రుల పాత్ర కుటుంబ నిర్మాణంలో ఎంత ముఖ్యమని వివరించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి. మల్లికార్జున్ మాట్లాడుతూ పిల్లల వ్యక్తిత్వ వికాసంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఏఓ గౌస్ బాషా మాట్లాడుతూ తల్లిదండ్రులు, పాఠశాల మధ్య సమన్వయం విద్యార్థుల విజయానికి దోహదపడుతుందని అన్నారు. అనంతరం నర్సరీ నుండి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు వారి తల్లిదండ్రుల మధ్య అనుబంధాన్ని పెంపొందించే విధంగా వినోదాత్మక ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ జయశ్రీ, చరణ్య, విజిత, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న బిఎల్ఓ

బాలాయపల్లి, జూన్ 20 ప్రభాతవార్త: కోనగుంట గ్రామంలో బి యల్ ఓ చెంచు కుమార్ టిడిపి వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వైసీపీ మండల కన్వీనర్ వెన్నోటి కార్తీక్‌రెడ్డి తాసిల్దార్ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. బి ఎల్ ఓ ఇంటింటికి వెళ్లకుండా గ్రామంలో రచ్చబండ మీద కూర్చొని ఫారాలు భర్తీ చేయకుండానే అందరికీ ఇస్తున్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీ వారికి అను కూలంగా బిఎల్ఓ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఓటర్లలో ఇబ్బంది పెడుతున్నట్లు చెప్పారు. బిఎల్ఓపై చర్య తీసుకోవాలని కార్తీక్‌రెడ్డి, సురేష్‌లో ఫిర్యాదు చేశారు. విచారిస్తామని తాసిల్దార్ వారికి చెప్పారు.

అభివృద్ధి ప్రణాళిక లరూపకల్పనకు శిక్షణ

సూళ్లూరుపేట, జూన్ 20 ప్రభాతవార్త: మండల పరిషత్తులు, గ్రామ పంచా యతీల పరిధిలో అభివృద్ధి ప్రణాళికను రూపొందించేందుకు శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జడ్పీటీసీలు, ఎంపీపీ, ఎంపీటీసీ, పంచాయతీ అభివృద్ధి అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2026-2027 ఆర్థిక సంవత్సరంలో అభివృద్ధి ప్రణాళిక సంఘం ఏవిధంగా తయారు చేయాలా అంశంపైశిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్, ఏపిఎం ప్రసన్నకుమారి, పిడిఓలు శ్రీనివాసులు, వరుణ్, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరుబాట తప్పదు : సిపిఎం

చిట్టమూరు, జూన్ 20 ప్రభాతవార్త: అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ప్రజలను అన్ని విధాల మోసం చేస్తూ దగా చేస్తుందని సిపిఎం నాయ కులు హెచ్చరించారు. శనివారం చిట్టమూరు మండల పరిధిలోని కొత్తగుంట గ్రామంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం కూటమి పాలనలో ప్రకృతి వనరులైన ఇసుక, మట్టి, గ్రావెల్,దోచేస్తున్నారని దుయ్య బట్టారు. చిట్టమూరు మండలంలోని వివిధ ప్రాంతాల్లోని కార్మికులుగా పని చేస్తున్న ప్రజలు ఎన్నో ఇబ్బందులకు, ఆటుపోట్లు గురవుతుంటే కూటమినేతలో ధనార్జనే ధ్యేయంగా విచ్చలవిడిగా ప్రకృతి వనరులను కొల్లగొడుతూ దోచుకోవడం సరికాదన్నారు. మండలంలో ఉన్న అటవీ భూములను సైతం ఆక్రమించి యదేచ్ఛగా కబ్జా చేస్తూ గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేని దుస్థితిలో కూటమి నేతలు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, ఐదు మండలాల అధ్యక్షులు ముకుంద, స్థానిక సిపిఎం నాయకులు జమాల్ బాషా, రమణయ్య, అంపల్లి మురళి తదితరులు ఉన్నారు.

తొలి విడత అన్నదాత సుఖీభవ

దొరవారిసత్రం, జూన్ 20 ప్రభాతవార్త: మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయం నందు తొలి విడత అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఆర్థిక సహాయం విడుదల కార్యక్రమంలో పాల్గొన్న సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ రైతులు సంక్షేమమే కూటమి ప్రభుత్వం యొక్క ప్రథమ ప్రాధాన్యతని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతు కుటుంబాల్లో ఆనందం నింపడం ప్రభుత్వ యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ప్రతి రైతు అకౌంట్లో రాష్ట్ర ప్రభుత్వం నుండి 5000, పీఎం కిసాన్ పథకం కింద 2000 మొత్తం 7000 చొప్పున రైతు అకౌంట్లో జమైనయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవుల సుబ్రహ్మణ్యం, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఆకుతోట రమేష్, సుధాకర్ రెడ్డి, వేమసాని శ్రీనివాస నాయుడు, సంచి విజయ్ కుమార్, బందిలి ఉదయ్ కుమార్, వ్యవసాయ అధికారి ఏవో గవాస్కర్, రైతులు పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సూళ్ళూరుపేట డివిజన్

అగ్రవర్ణ పేద విద్యార్థుల కోసం స్కాలర్‌షిప్స్

పెళ్లకూరు, జూన్ 20 ప్రభాతవార్త: పెళ్లకూరులో స్థానికంగా ఉన్న చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు చాగణం.గౌరీ శంకర్ అగ్రవర్ణాలకు చెందిన అనాథ, అత్యంత పేద విద్యార్థులకు తన సొంత నిధులతో ఆయన మాతృమూర్తి చాగణం లలితమ్మ జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం 30 లక్షల రూపాయలతో లలితమ్మ విద్యా వికాస స్కాలర్ షిప్స్‌ను పేద విద్యార్థులకు అందజేసి, ప్రోత్సహించడం జరుగుతుంది. అందులో భాగంగా 2025- 2026 సంవత్సరానికి గాను అగ్రవర్ణాలకు చెందిన అనాథ మరియు అత్యంత పేద విద్యార్థులను 120 మందిని ఎంపిక చేసి ప్రతి ఒక్క విద్యార్థికి 25 వేల రూపాయలు అందజేయడం జరుగుతుంది. ఇందుకు అర్హులైన బ్రాహ్మణ, వైశ్య, బలిజ, రెడ్డి, కమ్మ, వెలమ, క్షత్రియ, మరియు ఇతర అగ్రవర్ణాలకు చెందిన పేద విద్యార్థులు జూన్ 30వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను చాగణంఎల్‌బిఎంట్రస్ట్.ఓఆర్‌జి నుండి డౌన్లోడ్ చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 9440324449 ఫోన్ నెంబర్ సంప్రదించవల్సిందిగా తెలిపారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి : ఎంపీడీవో

పెళ్లకూరు, జూన్ 20 ప్రభాతవార్త: అంతర్జాతీయ యోగా దినోత్సవంను పురస్కరించుకుని మండలంలోని స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు యోగాంధ్ర కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, ప్రజలు, విద్యార్థులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీవో వేనయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమ నిర్వహణ గురించి శనివారం ఎంపీడీవో కార్యాలయం నందు ఎంఈఓ 2, పిడి, పిఈటి, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమ నిర్వహణ ద్వారా ప్రజలకు విద్యార్థులకు యోగ యొక్క ఆవశ్యకత దాని యొక్క విశిష్టత, మానవాళికి యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని నిర్ణయించారు.

'కోలా' హలంగా సామాజిక కార్యక్రమాలు

తొట్టంబేడు,జూన్ 20 ప్రభాతవార్త: రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ జన్మదిన సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో కోలా హలంగా సామాజిక కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో అన్నదానాలు జరిపారు.అలాగే పూజలు జరిపారు.ఉదయం శ్రీకాళహస్తీశ్వరుని దర్శనంతో సామాజిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం ఆశ్రమంలోనూ, స్వర్ణముఖి నది ఒడ్డున తాపీ మేస్త్రీ కార్మికులకు కోలా ఆనంద్ భోజనాలను అందించారు. తరువాత సంతమైదానంలోని ఓ మైదానంలో సంబరంగా కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయనజన్మదిన సందర్భంగా నాయకులు హాజరయ్యారు. కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నియోజకవర్గం నుంచే కాకుండా అనేక నియోజకవర్గాల నుంచి కూడా కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కాగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన కూడళ్లలో సామాజిక కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. సంబరాల్లో పాల్గొన్న వారిలో శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి అధ్యక్షులు రంగినేని చెంచయ్య నాయుడు, వివిధ పార్టీలకు చెందిన మంగిరెడ్డి, చిలకా రంగయ్య, కుప్పా ప్రసాద్, దశరధాచ్చారి, వరప్రసాద్, మిన్నల్‌రవి, ఉమేష్‌యాదవ్, కాసరం రమేష్, వజ్రం కిషోర్, జనసేనకు చెందిన విజయ్, మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి,కొండేటి గోపాల్, ఏడేం కృష్ణయ్య, హరీష్‌రెడ్డి, భదీర్తి వవెంకటేష్, నరేష్‌రాయల్, పూజారి ప్రేమ్‌కుమార్‌రెడ్డి, ధర్మయ్య యాదవ్, ప్రజ్ఞశ్రీ,చొక్కాని రామమూర్తి, కోనేటి అయ్యప్ప, పేట బ్రదర్స్, చందురాయల్, అమర్‌నాథ్, కన్నా వెంకటేశ్వర్లు, లింగాబత్తిన గోపాల్,పుణ్యం డిల్లికుమార్, వాసుయాదవ్, రవిరాయల్, భరత్‌నాయుడు, సజ్జా హరీష్, శివారెడ్డి, రవిరాయల్, రాఘవులు నాయుడు, హరిరాయల్,సుబ్బయ్య, రవి ఆచారి, చోటు,డక్కిలి శివ, దొరబాబు, నరేంద్ర, ధర్మ, అనిల్,శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ధ్యేయం : బృందమ్మ

తొట్టంబేడు,జూన్ 20 ప్రభాతవార్త: రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని బొజ్జల బృందమ్మ అన్నారు. తొట్టంబేడు మండలం కారాకొల్లు గ్రామంలో శనివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ నగదును ఆమె చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందిస్తున్న ఈ నగదును రైతులు సద్వినియోగం చేసుకోవాలనా ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల టీడీపి అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు, తొట్టంబేడు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు వాడపల్లి జయచంద్రనాయుడు, కారాకొల్లు గ్రామ పరిసర ప్రాంతాల రైతులతో పాటుగా, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బంది లేకుండా...పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి

చిత్తూరు, జూన్ 20 ప్రభాతవార్త: ఓటర్లు సులభంగా, ఇబ్బంది లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవడానికి వీలుగా జిల్లాలో పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ పునర్వ్యవస్థీకరించే ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్వహిస్తోందని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని డిఆర్ఓ సమావేశహాలులో శనివారం జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో ఈ రోజు నాటికి 13,40, 126 మంది ఓటర్లు వున్నారని, కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ మేరకు ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ ద్వారా బోగస్, మృతి చెందిన వారి పేర్లను జాబితా నుండి తొలగించి పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించడానికి చర్యలు తీసుకుంటున్నా మన్నారు. పోలింగ్ స్టేషన్ల పరిధిలో బిఎల్ఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ బిఎల్ఏ ద్వారా పరిశీలించుకోవచ్చునని, అలాగే రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ దృష్టికి వచ్చిన బోగస్, మృతి చెందిన వారి వివరాలను బిఎల్ఓలకు తెలిపి ఓటరు జాబితా నుండి వారి పేర్లు తొలగింపుకు సహకరించాలని కోరారు. ఒక పోలింగ్ స్టేషన్‌లో ఓటర్ల సంఖ్య సాధారణంగా 1,200 నుండి 1,500 మించకుండా వుండాలన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కె.బాలసుబ్రమణ్యం(ఆమ్ ఆద్మీ పార్టీ), అట్లూరి శ్రీనివాసులు (బిజెపి), బి.లోకనాథం (బిఎస్‌పి), వెంకిటీల సురేంద్రకుమార్ (తెలుగుదేశం), ఉదయ్‌కుమార్ (కాంగ్రెస్), రమేష్ బాబు (కాంగ్రెస్), నగరి ఆర్డీఓ అనుపమ, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, కుప్పం ఆర్డీఓ విజయలక్ష్మీ, పలమనేరు ఆర్డీఓ భవానీ, ఎలక్షన్ సెల్‌సెక్షన్ సూపరిటెండెంట్ రాజేంద్ర, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ :

కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోడౌన్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంకిటీల సురేంద్రకుమార్, బి.లోకనాథం, అట్లూరి శ్రీనివాసులు, ఉదయ్‌కుమార్, రమేష్‌బాబు, కె.బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి పూర్వ వైభవం : ఎమ్మెల్యే

వడమాలపేట, జూన్ 20 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వ పాలనలో వ్యవసాయానికి పూర్వ వైభవం వచ్చిందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ 4వ విడత నిధుల విడుదల సందర్భంగా వడమాలపేట మండల పరిషత్ కార్యాలయం వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో 20079 మంది రైతులకు రూ.13.25 కోట్లు జమ అయ్యాయని చెప్పారు. గతంలో రైతు భరోసా పేరుతో వైసీపీ ప్రభుత్వం రూ.7500 మాత్రమే ఇస్తే, కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవగా రూ.14 వేలు అందిస్తోందన్నారు. ప్రధాని మోదీతో పాటు పల్నాడు జిల్లాలో సీఎం చంద్రబాబునాయుడు నిధులు విడుదల చేశసన కార్యక్రమాలను డిజిటల్ స్క్రీన్‌పై వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరులు, వ్యవసాయ అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు, టీడీపీనాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి

పుత్తూరు (నగరి), జూన్ 20 ప్రభాతవార్త : గత వైసిపి ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లో వెనుకబడిన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోడి సహకారంతో అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం నగరి పట్టణంలో అభివృద్ధి-సంక్షేమం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్నికలపుడు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందన్నారు. గత రెండేళ్లలో నగరి నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమంలో పురోగమిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తల్లికి వందనం పథకం ద్వారా సుమారు 67 లక్షల మందికి పైగా విద్యార్థులకు రూ. 10,000 వేల కోట్ల మేరకు ఆర్థిక సాయం అందించామన్నారు. 65 వేల కోట్లకు పైగా వివిధ రకాల పెన్షన్లు పంపిణీ చేశామన్నారు. విద్యారంగంలో మెగా డిఎస్సీ ద్వారా 15,941 పోస్టులు, 5,757 కానిస్టేబుళ్ల పోస్టులను భర్తీ చేశామన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓంశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు:

ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ జన్మదినం సందర్భంగా నగరి పట్టణంలోని ఓం శక్తి ఆలయంలో నాయకులు విశేష పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు అమ్మవారి తీర్థ, ప్రసాదాలు అందించారు. అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. నాయకులు శాలువా, పూలమాలతో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.గుణశేఖర్, శ్రీనివాసులు, జిల్లా నాయకులు జి.జ్యోతినాయుడు, ఇంకా ఎం.వి.బాబు, నారాయణస్వామినాయుడు, చిట్టి తదితరులు పాల్గొన్నారు,

ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు

- కేక్ కటింగ్.. ఆలయంలో పూజలు.. అన్నదానం !!

కుప్పం, జూన్ 20 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను శనివారం కుప్పంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, సిఎం పిఏ శ్రీకాంత్ తదితరులు కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద పేదలకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ నారా భువనమ్మ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో దీర్ఘాయుష్షుతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజా, సామాజిక సేవా కార్యక్ర మాలతో నారా భువనమ్మ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో కడ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, రెస్కోఛైర్మన్ ప్రతాప్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, మాజీ సర్పంచ్ గోపీనాథ్, కార్పోరేషన్ డైరెక్టర్లు వేణు, తిరుమగళ్, కౌన్సిలర్లు సోమశేఖర్, జాకీర్, కడ సభ్యురాలు సుగుణమ్మ,సత్యేంద్రశేఖర్, ఆర్ఆర్ రవి, మంజు,దేవా, ఉమేర్ ఖాన్, మహిళా నేతలు చంద్రకళ, శారదమ్మ, షహనాజ్ పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి, జూన్ 20 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం స్వామివారు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయ అర్చకులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, అసిస్టెంట్ హరి ప్రసాద్, సిబ్బంది సుబ్రమణ్యం, అర్చకులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I,**S.Sivaprakash Reddy,** son of Bhaskar Reddy residing at Door No: 27-1002, Ramnagar Colony, Chittoor. Pin Code-517 001, Andhra Pradesh. My PAN card number FZTPR3829H. My father name was wrongly shown as **B.SUBBA REDDY** instead of **S.BHASKAR REDDY** in my PNB Met Life Insurance policy bonds bearing Policy Numbers:

1. 1200800638064
2. 1200800632211

In my Aadhaar Card Number 52**********29, my father name is S.BHASKAR REDDY. Hence, I Confirm my father name is **S.BHASKAR REDDY.**

CHANGE OF NAME

I,**Sri GOWRI PRAKASH/** P.Sri Gowri, Daughter of Pratap Reddy and wife of S.SIVA PRAKASH REDDY residing at Door No:27-1002, Ramnagar Colony, Chittoor, Pin Code-517 001, Andhra Pradesh. My father name was wrongly shown as **S.SIVA PRAKASH REDDY** instead of **M.PRATAP REDDY** in my PNB Met Life Insurance Policy bonds bearing policy numbers:

1. 1200900832082
2. 1200800581401

In my PAN CARD number BZLPS5375K, my father name is **M.PRATHAP REDDY.** Hence, I confirm my father name is M.PRATHAP REDDY.

డిగ్రీ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల సత్తా

పాకాల, జూన్ 20, ప్రభాతవార్త డిగ్రీ ఐదో సెమిస్టర్ యూనివర్సిటీ పరీక్షల ఫలితాల్లో పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కళాశాలకు చెందిన బీఎస్సీ విద్యార్థులు 92 శాతం, బీకాం విద్యార్థులు 83 శాతం, బీఏ విద్యార్థులు 80 శాతం ఉత్తీర్ణత సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. బీకాం విభాగంలో అడ్వాన్స్డ్ కార్పొరేట్ అకౌంటింగ్ సబ్జెక్టులో నబి, సల్మా 100 మార్కులు సాధించగా, అనుశ్రీ, పూజిత, దేవి ప్రసాద్ యాదవ్, కార్తీక్‌లు 95 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. మేనేజీరియల్ అకౌంటింగ్‌లో జాస్మిన్ 96 మార్కులు, కెమిస్ట్రీ విభాగంలో అంజన 97 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత, అధ్యాపక బృందం అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో ఉన్నత విజయాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

పాకాల, జూన్ 20, ప్రభాతవార్త పాకాల మండలం చిన్న గోర్పాడు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సుధీర్, తన మిత్ర బృందం సహకారంతో మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సుమారు రూ.85 వేల విలువైన విద్యా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) బాబ్జి చేతుల మీదుగా విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్లు, పెన్సిల్లు, బాక్సులు, రబ్బర్లు తదితర సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ తాను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నానని, అలాగే పలువురికి శిక్షణ కూడా అందిస్తున్నానని తెలిపారు. తన మిత్రులతో కలిసి విరాళాలు సేకరించి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తమ వంతు సహాయంగా విద్యా సామగ్రిని అందజేస్తున్నామని చెప్పారు. మనకు విద్యను అందించిన పాఠశాలలు, సమాజం పట్ల కృతజ్ఞత భావంతో పే బ్యాక్ టు సొసైటీ అనే నినాదంతో గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా సామగ్రిని అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎంఈవో బాబ్జి మాట్లాడుతూ సుధీర్, ఆయన మిత్ర బృందం చేపట్టిన ఈ సేవా కార్యక్రమం అభినందనీయమన్నారు. విద్యార్థులు అందించిన విద్యా సామగ్రిని సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని సూచించారు. మండల విద్యాశాఖ తరపున సుధీర్‌తో పాటు ఆయన మిత్ర బృందానికి ఎంఈవో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోలా ఆనంద్, విశాలాక్షి జన్మదిన వేడుకలు...

రేణిగుంట జూన్ 20 ప్రభాతవార్త బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్, ఆయన సతీమణి విశాలాక్షి జన్మదిన వేడుకలు శనివారం, శుక్రవారం రేణిగుంట మండలంలోని అనేక ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. కరకంబాడి హై స్కూల్ నందు. భాస్కర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పాఠశాల పిల్లలకు పుస్తకాలు పెన్నులు స్వీట్లు పంచారు. రేణిగుంట బస్టాండ్ లో నరేష్ రాయల్.ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొని పేదలకు అన్నం పెట్టారు. పాత ఎయిర్ పోర్ట్.రోడ్డు వద్ద ఉన్న అక్షయ క్షేత్రం నందు రాజా రాయల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భోజనాన్ని ప్రత్యేక ప్రతిభావంతులకు వడ్డించారు. రేణిగుంట చెక్‌పోస్ట్ సర్కిల్ వద్ద ఉన్నా రాజా రాయల్ ఆఫీస్ నందు రాజారాయల్ రేణిగుంట లారీ యూనియన్. సభ్యుల ఆధ్వర్యంలో కేకు కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఇది ఇలా ఉండగా బిజెపి నేత తిరుపతి జిల్లా ముదిరాజ్ సంఘం జిల్లా కన్వీనర్ కుర్రకాల వేణు కోలా ఆనంద్ కుమార్ ను ఘనంగా సత్కరించి తన అభిమానాన్ని చాటుకున్నారు.

రిషితా రెడ్డి పాదయాత్రకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు

రేణిగుంట జూన్ 20 ప్రభాతవార్త.

రాష్ట్రంలో కూటమిపాలన రావడంతోపాటు శ్రీకాళహస్తిలో బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి విజయం సాధించాలని ఏడుకొండల శ్రీ వెంకటేశ్వర స్వామి కి మొక్కులు చెల్లించుకోవడానికి సుధీర్ రెడ్డి సతీమణి రిషితా రెడ్డి శనివారం తిరుమలకు పాదయాత్ర ప్రారంభించారు. ఊరందూరు నుంచి ప్రారంభమైన పాదయాత్రగా తిరుమలకు నిర్విఘ్నంగా సాగింది. టిడిపి నాయకులు, తెలుగు మహిళలు అనుసరించారు.. దారి పొడవునా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, మహిళలు, ప్రజలు స్వాగతం పలుకుతూ కర్పూర హారతులు ఇచ్చారు. రేణిగుంట మండలం లోని పలు గ్రామాలలో రేణిగుంట పట్టణం నందు ఆమెకు అపూర్వ స్వాగతం లభించింది. రిషిత రెడ్డి పాదయాత్ర దిగ్విజయంతంగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో నెరవేరాలని బొజ్జల సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ దీవించారు. తిరుపతి పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి,రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రెడ్డి, అన్నాసం పల్లి టిడిపి ఇంచార్జి ముచ్చెలి భాస్కర్ రెడ్డి, అన్నసంపల్లి యూనిట్ ఇంచార్జి సీనియర్ నాయకులు నాదముని రెడ్డి, మైనార్టీ నాయకులు నవాబు, మండల మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నెల్లూరు సుబ్రహ్మణ్యం, జి పాలెం టిడిపి సీనియర్ నాయకుడు రాజశేఖర్ రెడ్డి, టిడిపి లీగల్ సెల్ నాయకులు అడ్వకేట్ ఉదయ్ కుమార్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు పుష్ప నాదం, కన్నన్ రెడ్డి, తదితరులు ఆమెకు స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు

ఆర్థిక ప్రగతికి మహిళా సంఘాలే సోపానాలు : ఎపిఎం

నారాయణవనం, జూన్ 20 ప్రభాతవార్త :

మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందాలంటే మానవ అభివృద్ధి సూచికలపై అవగాహన కలిగి వుండాలని సెర్ప్ సహాయ ప్రాజెక్టు అధికారి టి ధనంజయరెడ్డి తెలిపారు. శనివారం మండల సమాఖ్య కార్యాలయంలో ఎంఎస్‌ఈసీ సభ్యులకు, ఎంసీఎల్‌ఎఫ్ విజన్ బిల్డింగ్ మాడ్యూల్-2పై జరుగుతున్న రెండవ రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ గ్రామ సంఘం వారిగా వచ్చిన ప్రణాళికలను క్రోడీకరించి వాటికి అనుగుణంగా నెలవారీ చేయవలసిన కార్యక్రమాలపై వివోఈసీ సభ్యులకి పూర్తి స్థాయి శిక్షణ కల్పించడం జరిగిందన్నారు. అలాగే జండర్ ప్రతిజ్ఞ చేసి సమానత్వంపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత, కుటుంబ, గ్రామాలభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషించేందుకు నిర్దేశించిన అభివృద్ధి సూచికలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిసిలు నిమ్మీ, అరుణ్‌కుమార్, రాజేశ్వరీ, ఎంఎస్ అధ్యక్షురాలు రామతులసీ, విఓ లీడర్లు, సంఘమిత్ర సభ్యులు పాల్గొన్నారు.

తిరుచ్చివాహనంపై భక్తులకు దర్శనిమిచ్చిన కల్యాణవేంకటేశ్వరుడు

నారాయణవనం, జూన్ 20 ప్రభాతవార్త :

నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలో శనివారం సందర్భంగా భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం పాలు, పెరుగు, నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వామి, అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవారిని ఊరేగించారు. సాయంత్రం 6గంటల నుంచి గంటపాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. వినిపించారు.

యోగా మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదం

యోగా మాస్టర్, ప్రొఫెసర్ మునిరత్నం రెడ్డి
బ్లూమింగ్ బడ్స్ స్కూల్లో ఘనంగా యోగా దినోత్సవం

చంద్రగిరి, జూన్ 20 ప్రభాతవార్త:

మానసిక, శారీరక ఉల్లాసానికి యోగా దోహదపడగలదని యోగా మాస్టర్, ప్రొఫెసర్ మునిరత్నం రెడ్డి అన్నారు. స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని బ్లూమింగ్ బడ్స్ స్కూల్లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన "మానవాళికి యోగా" అనే నినాదంతో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. అనంతరం పాఠశాల చైర్మన్ బి.హితేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానవాళికి పెరుగుతున్న ఒత్తిడిని అధిగమించడానికి యోగా చక్కటి ఉపాయం అన్నారు. విద్యార్థులు చిన్నతనం యోగాను అలవరుచుకున్నట్లయితే వారిలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని అన్నారు. అనునిత్యం యోగా సాధన చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపిటి సురేష్, గీతలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్‌అడ్మిషన్స్ ప్రారంభం : ప్రిన్సిపాల్

సత్యవేడు, జూన్ 20 ప్రభాతవార్త:

ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్స్ కొనసాగుతున్నట్లు తిరుపతి జిల్లా సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ జూన్ 6వ తేదీ నుంచి అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు టీసీ, స్టడీ, విద్యార్థితో పాటు తల్లిదండ్రుల ఆధార్, బ్యాంకు పాస్‌పుస్తకం, రెండు కలర్ ఫోటోలు తీసుకొచ్చి దరఖాస్తు పూరించే సమర్పించాలన్నారు. కళాశాలలో, ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ కోర్సుల్లో తెలుగు, ఆంగ్లం మాధ్యమాల్లో అడ్మిషన్స్ పొందవచ్చున్నారు. సైన్స్ గ్రూప్‌కి సంబంధించి 2654 రూపాయలు, ఆర్ట్స్ గ్రూపుకి రూ.1150లు అడ్మిషన్ ఫీజుగా చెల్లించాల్సి ఉందన్నారు. నెల రోజులు పాటు ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్స్ కొనసాగుతుందని ఆయన వివరించారు.

ఘనంగా రెవెన్యూ డే వేడుకలు

సత్యవేడు, జూన్ 20 ప్రభాతవార్త:

సత్యవేడు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివప్రసాద్ ఆదేశాల మేరకు శనివారం రెవెన్యూ డే(రాష్ట్ర రెవెన్యూ దినోత్సవం) వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్‌ని డిప్యూటీ తహసీల్దార్లు డి.వెంకటేశ్వరులు, త్యాగరాజు కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య రెవెన్యూ శాఖ ఒక బలమైన వారధిలా పని చేస్తుందని పేర్కొన్నారు. నరంతరం ప్రజలకు జవాబుదారీగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేర్చడంలో, భూ పరిపాలనలో రెవెన్యూ సిబ్బంది బాధ్యతాయుతంగా సేవలందించాలన్నారు. భవిష్యత్‌లో చిత్తశుద్ధితో పనిచేసి మండల ప్రజలకు మరింత సేవలు అందించాలని వారు పిలుపునిచ్చారు. ఈ వేడుకలో సత్యవేడు మండలానికి చెందిన విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లు, వీఆర్‌వో, సర్వేయర్లు, సచివాలయాల విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లు, వీఆర్‌ఏలు, కార్యాలయ సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వీ టూ హెల్ప్ యూ స్వచ్ఛంద సంస్థచే బహుమతి

సత్యవేడు, జూన్ 20 ప్రభాతవార్త:

సత్యవేడు స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి విద్యార్థినులకు హైదరాబాద్‌కు చెందిన వీ టూ హెల్ప్ యూ నాన్ గవర్నమెంట్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బాలచంద్రారెడ్డి చేతుల మీదుగా టాపర్లకు ఈ పురస్కారాలను బహుకరించారు. పదో తరగతిలో 582 మార్కులతో పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిన డి.నివేదాకు రూ.10 వేలు, 494 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన వి.రమ్యకు రూ.7.500, అలాగే 487 మార్కులతో తృతీయ స్థానం పొందిన కె.భార్గవికి రూ.5 వేలు నగదు బహుమతిగా అందించారు.

మంచి స్నేహాలతోనే ఉన్నత గుర్తింపు

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి వ్యక్తిగత విద్యాపరమైన అభివృద్ధి వారు ఎంచుకునే స్నేహితులపైనే ఆధారపడి ఉంటుందని, విద్యార్థులు ఎప్పుడూ మంచి,తెలివైన వారితో స్నేహం చేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ బాలికలు చదువుతో పాటు సంస్కారవంతంగా ఎదగాలని, క్రమశిక్షణతో కూడిన ప్రణాళికాబద్ధమైన చదువు, మంచి పుస్తకాల పఠనం ద్వారానే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థినులనుప్రోత్సహిస్తూ నగదు బహుమతులు అందజేసినందుకు వీ టూ హెల్ప్‌యూ సంస్థకు పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లోను పాఠశాల విద్యార్థులకు ఇలాగే సహకారం అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వాణి, సురేఖ, సుగుణ, డిల్లీరాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఫీజు రీయంబర్స్ మెంట్, సకాలంలో విడుదల చేయాలి

సత్యవేడు, జూన్ 20 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వేలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదల్లో జాప్యం కారణంగా ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అఖిలభారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్) చిత్తూరు జిల్లా సంయుక్త కార్యదర్శి ఆర్.కె.అజిత్‌కుమార్ పేర్కొన్నారు. సత్యవేడు నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తమ విద్యను కొనసాగించడానికి ప్రభుత్వ సహాయంపై ఆధారపడుతున్నారని తెలిపారు. అయితే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సకాలంలో విడుదల కాకపోవడం వల్ల విద్యార్థులు కళాశాల ఫీజులు చెల్లించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు అప్పులు చేసి చదువులు కొనసాగించే పరిస్థితి ఏర్పడకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లనువెంటనే విడుదల చేసి, భవిష్యత్‌లో ఎటువంటి జాప్యంలేకుండా ప్రతి విద్యార్థికి సమయానికి ఆర్థిక సహాయం అందేలా పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. డిమాండ్ల పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని, స్కాలర్‌షిప్‌లను ప్రతి విద్యా సంవత్సరంలో సకాలంలో అందించాలని, మధ్య తరగతి విద్యార్థుల విద్య హక్కును ప్రభుత్వం కాపాడాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల పంపిణీలో పూర్తి పారదర్శకత పాటించాలన్నారు. విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడొద్దని విద్య ప్రతి ఒక్కరి హక్కు విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆర్.కె.అజిత్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే భానుకు వేదపండితులు ఆశీర్వచనాలు

వడమాలపేట, జూన్ 20 ప్రభాతవార్త:

నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు పుట్టిన రోజు సందర్భంగాఅప్పలయాగుంట ఆలయం లోని వేదపండితులు శనివారం ఆశీర్వచనాలు అందజేశారు. ఉదయం తిరుపతిలోని ఎమ్మెల్యే ఇంటికి చేరుకున్న అధికారులు, వేదపండితులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఆలయ అధికారి వేణుగోపాల్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, వేదపండితులు పాల్గొన్నారు.

ఘనంగా భానుప్రకాష్ జన్మదిన వేడుకలు

ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ జన్మదినాన్ని వడమాలపేట మండలంలోని యూత్ నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి కేక్‌కత్తిరించి సంబరాలు చేసుకున్నారు. యూత్ నాయకుడు ఉదయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రసన్న వెంకటేశ్వరునికి ఘనంగా గ్రామోత్సవం

వడమాలపేట, జూన్ 20 ప్రభాతవార్త:

అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి శనివారం ఊంజల్‌సేవ, గ్రామోత్సవం గనంగా జరిగింది. వేకువ జామున సుప్రభాతసేవలో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఉభయదేవేరులతో పాటు స్వామి వారి ఉత్సవ మూర్తులను ఊయాలలో కొలువుదీర్చిగా స్వామివారు గంటపాటు సిద్విలాసంగా ఊయలలూగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తిరుచ్చి వాహనాన్నిఅధిరోహించిన స్వామివారు మాడా వీధుల్లో విహరించారు. భక్తులు ధూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, అర్చకులు రమణాచార్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

గజవాహనంపై గ్రామవీధుల్లో ఊరేగిన పరాశరేశ్వరుడు

నారాయణవనం, జూన్ 20 ప్రభాతవార్త :

నారాయణవనంలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం చంపకవల్లీ సమేత పరాశరేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం రాత్రి గజవాహనంపై స్వామి, అమ్మవారు విహరించారు. రాత్రి 7గంటలకు స్వామి, అమ్మవార్లను గజవాహనంపై అధిరోహించి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో శుద్ధి, నిత్య కైంకర్యపూజా కార్యక్రమాలను నిర్వహించిన అభిషేకం, స్వామి, అమ్మవారిని పుష్పాలతో సుమనోహరంగా అలంకరించిన తర్వాత స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఊరేగింపులో భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, సిబ్బంది భరత్, అర్చకులు పాల్గొన్నారు.

తిరుపతి డివిజన్

విద్యార్థి దశ నుండే స్వచ్ఛతపై అవగాహన కల్పించాలి

తిరుపతి కార్పొరేషన్, జూన్ 20 ప్రభాతవార్త

విద్యార్థి దశ నుండే పిల్లలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉందని ప్రముఖులు తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్రలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఉపాధ్యాయుల నగర్ నందు పారిశుద్ధంపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, హస్త కళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ హరి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య తదితరులు పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు శుభ్రంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందరూ ఆరోగ్యాకరంగా ఉండాలనే సదుద్దేశ్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమాలను స్వచ్ఛతపై పాఠశాల స్థాయి నుండే పిల్లలను అవగాహన కల్పిస్తే భావి తరాలను పరిశుభ్రమైన వాతావరణం అందించిన వారం అవుతామని అన్నారు. పాఠశాల స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తే పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు చేసినట్లు అవుతుందని తెలిపారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యామ్ సుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, డిసిపీ దేవి కుమారి, డి. ఈ. లు ప్రసాద్, మహేష్, రాజు, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

తిరుపతి కోర్టు ప్రాంగణంలో నేడు యోగా కార్యక్రమం

తిరుపతి(లీగల్), జూన్ 20 ప్రభాతవార్త:

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నేడు ఆదివారం ఉదయం 8.30 గంటలకు తిరుపతిలోని 3 అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలోప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవల కమిటీ వెల్లడించింది. ఈ మేరకు కమిటీ చైర్మన్, మూడవ అదనపు జిల్లా జడ్జి ఒక సర్క్యులర్ జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవల ప్రాధికార సంస్థ సూచనల మేరకు శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణకు యోగా ప్రాధాన్యతను చాటి చెప్పే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవరచుకోవడంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తిరుపతి న్యాయస్థానాల న్యాయమూర్తులు, న్యాయ సిబ్బంది, న్యాయవాదులు పాల్గొనాలని కోరారు. సంబంధిత కోర్టుల ప్రెసిడెంట్ అధికారులు తమ సిబ్బందిని యోగా కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

ధృవ జీవామృతం తయారీ కోసం డ్రమ్ములు పంపిణీ

కేవీబీ పురం, జూన్ 20 ప్రభాతవార్త:

ధృవ జీవామృతం తయారీ కోసం రైతులకు ప్రగతి సంస్థ డైరెక్టర్ కె.వి.రమణ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం జరిగింది. కేవీబీ పురం మండలం ఆధవరం గ్రామంలో ప్రగతిసంస్థ సహకారంతో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ధృవ జీవామృతం తయారీ కోసం రైతులకు డ్రమ్ములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పూర్వీకులు చేసిన వ్యవసాయ విధానాలను గుర్తు చేస్తూ గత 50 సంవత్సరాలుగా రసాయనిక పంటలు పండిస్తున్నామని, దీని ద్వారా భూమి ఆరోగ్యం పాడపోయిందన్నారు. ఈ పంటలు తినడం వల్ల మన ఆరోగ్యం పాడవుతుందని, ప్రకృతిలో లభించే వనరులతోనే వ్యవసాయం చేసి మంచి దిగుబడులు సాధించడమే కాకుండా ఎంతో ఆరోగ్యంగా ఉండేవారని, వారి స్ఫూర్తితో రసాయన వ్యవసాయం నుంచి ప్రకృతి వ్యవసాయం వైపు రైతు మారాలని రైతులకు సూచించారు. అదే విధంగా ధృవ జీవామృతం పంటకు ఎరువుగా ఉపయోగపడడమేగాక భూమిలోని సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయంలో జీవామృతం ముఖ్యమైన కషాయం ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగంగా పరచుకోవాలని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రగతిసంస్థ పీసీవో వెంకటేష్ నాయక్, ఫీల్డ్ కో-ఆర్డినేటర్ ప్రభాకర్, కమ్యూనిటీ ఆర్గనైజర్స్ శేఖర్, కుమార్ రత్నం, ఏపీ యానాది సంఘం చందమామల కోటయ్య, తదితర గ్రామ రైతులు పాల్గొన్నారు.

వారాహి అమ్మన్ దేవాలయంలో నగరి ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

పుత్తూరు రూరల్, జూన్ 20 ప్రభాతవార్త:

పుత్తూరు మండల పరిధిలోని కణంమిట్టలో వెలసిన శ్రీదక్షిణ కాళీ వారాహి అమ్మన్‌దేవాలయంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మోహన్ స్వామి ఎమ్మెల్యేకి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలో విశేష పూజలు చేశారు. అలాగే ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి శాలువ కప్పి ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు వైభవంగా ఆలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.వి.హరినాయుడు, వైస్ చైర్మన్ పి.కె.హరి, ప్రెసిడెంట్ ఎన్.హరి, సెక్రటరీ ఏ.వెంకటేశ్వరులు, వర్కింగ్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీ కె.ప్రవీణ్ నాయుడు, వైస్ ప్రెసిడెంట్ కె.మంజు నాయుడు, మురళీరెడ్డి, వెంకటేష్‌యాదవ్, భూపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి ప్రశంసాపత్రం

పుత్తూరు రూరల్, జూన్ 20 ప్రభాతవార్త:

శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలు కార్యక్రమం సందర్భంగా పుత్తూరు మున్సిపల్ పరిధిలోని రాచపాళెం జిల్లా ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం ఆచారికి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మంగపతి మాట్లాడుతూ శుక్రవారం రాజమండ్రిలో తెలుగు-వెలుగు అంశంపై 1090 సాహిత్య కవితా పోటీలో 20 మందిని విజేతలుగా ప్రకటించారు. అందులో ఒక ఈ పాఠశాల ఉపాధ్యాయుడు కావడం మాకు సంతోషదాయకంగా ఉందన్నారు. 168వ జాతీయ స్థాయి కవి సమ్మేళనంలో తెలుగు వెలుగుని ప్రపంచమంతా విరాజిల్లేలా చేశారన్నారు. జాతీయ స్థాయి నిర్వహణ కమిటీ ప్రశంసాపత్రం అందజేసిన సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

పాఠశాలకు బోర్డు వితరణ

విజయపురం, జూన్ 20 ప్రభాతవార్త:

మండలంలోని కాళికాపురం ప్రాథమిక పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ యాజమాన్య కమిటీ చైర్మన్ కె.సురేష్ పదివేలు విలువచేసే స్కూలు నేమ్ బోర్డుని మండల విద్యాశాఖ అధికారులు శ్యామల, హరిప్రసాద్‌వర్మ చేతుల మీదుగా వితరణ చేశారు. ఈ సందర్భంగా దాతలను అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు శాలువతో సన్మానించి అభినందించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మణిగండన్, ఉపాధ్యాయులు కె.బి.శిల్ప, వెల్ఫేర్ అసిస్టెంట్ శివానందం, సీఆర్పీ హేమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు డిల్లీ, పాఠశాల మాజీ చైర్మన్ సురేష్, కాళికాపురం మాజీ సర్పంచ్ రమేష్, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో ఘనంగా యోగా దినోత్సవం

పుత్తూరు రూరల్, జూన్ 20 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణం గోవిందపాళెంలోని శ్రీవిద్యడిగ్రీ కళాశాలలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధ్యాన విద్యార్థి ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ నాగరాజు విద్యార్థులు,అధ్యాపకులచే మెడిటేషన్,యోగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి యోగా, మెడిటేషన్‌ను జీవితంలో ఒక భాగంగా క్రమశిక్షణతో అలవాటు చేసుకోవాలని, ఈ సంవత్సరం యోగా డే యొక్క థీమ్ ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా అని తెలియజేస్తూ యువత యోగాతో నవ యవనాన్ని ఉత్సాహాన్నిసొంతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి డివిజన్

రిపోర్టర్ల సమావేశం ఉంది...రూ.30వేలు ఇవ్వండి

-వార్త దినపత్రిక పేరుతో...నకిలీ రిపోర్టర్

శ్రీకాళహస్తి,జూన్ 20 ప్రభాతవార్త: నేను వార్త దినపత్రిక తిరుపతి జిల్లా ఇన్‌చార్జిని, మా కార్యాలయంలో మిటింగ్ ఉంది, భోజనాలు ఏర్పాటు చేయాలి! రూ.30వేలు ఫోన్‌పే చేయమని, వడమాలపేట, ఏర్పేడు తదితర మండలాల అభివృద్ధి అధికారికి 9963574167 నెంబర్ నుంచి కాల్ చేసారు. ఈ కాల్‌తో ఖంగు తిన్న ఎంపిడిఓ తాము అంత మొత్తం ఇచ్చే పరిస్థితి లేదని, మేము అక్రమ మార్గాల్లో సంపాదించలేదని తెలిపింది. దీంతో ఆ విలేఖరి ఆమెతో మాకంతా తెలుసని, మీరు ఎంత సంపాదిస్తారో అన్నీ తెలుసు అన్నట్లు తెలిసింది. అంటూ మీ మండలంలోని పంచాయతీ కార్యదర్శుల నెంబర్లు ఇవ్వండని డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ సంఘటనకు సంబంధించి శ్రీకాళహస్తి ప్రభాతవార్త, ఎంపిడిఓ సౌభాగ్యంను వివరణ కోరగా ఆమె నిజమేనని వివరణ ఇచ్చారు. ఫోన్ చేసిన వ్యక్తి తాను తిరుపతి వార్త దినపత్రిక జిల్లా ఇన్‌చార్జి అని చెప్పాడని తెలిపారు. ఈ నెంబర్ గల వ్యక్తి వార్త దిన పత్రిక పేరు చెప్పి గతంలో వడమాలపేటలో వార్త సబ్‌ఎడిటర్ అని కూడా డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. అయితే ఆతనికి వార్త దినపత్రికకు ఎలాంటి సంబంధం లేకున్నా, ఇదో వ్యాపకంగా చేసుకొని అధికారుల వద్ద సొమ్ములు వసూళ్ళకు పాల్పడుతున్నట్లు సమాచారం.

కోలా ఆనంద్‌ను...అభినందించిన ఎంఎల్‌ఏ

శ్రీకాళహస్తి,జూన్ 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి రాజకీయాల్లో క్రియా శీలకంగా ఉంటూ ప్రజలకు నేనున్నా నంటూ ఆదుకునే మనస్తత్వం గల రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద కుమార్‌ను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అభినందిం చారు. కోలా ఆనంద్‌కుమార్ జన్మదిన సందర్భంగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి దుశ్శాలు వతో సత్కరించారు. ఆయన ప్రజల మనిషి అని ఎవరికి ఏ అవసరం వచ్చినా పార్టీలతో ప్రమేయం లేకుండా ముందు ఆదుకోవటం మంచి గుణం అన్నారు. కూటమిలో భాగస్వామి అయిన కోలా ఆనంద్ శ్రీకాళహస్తి నియోజకవర్గం అభివృద్ధిలో తనకు అన్నగా ముందుండి నడిపిస్తున్నారని అంతేకాక ప్రజల అవసరాలను గుర్తించి తన దృష్టికి తెస్తున్నారని ఆ సమస్యలు పరిష్కారానికి సూచనలు చేస్తున్నారని ఎంఎల్‌ఏ అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంఎల్‌ఏతో పాటు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు, మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు,పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి గాలి చలపతి నాయుడు, మిన్నల్ రవి, గుమ్మడి దరశరధాచ్చారి, డాక్టర్ ఉమేష్‌రావు, మోహన్‌రెడ్డి, వజ్రం కిషోర్, మునిరాజా యాదవ్, ఖాదర్ బిజెపి నాయకులు కండ్రిగ ఉమ, అమర్‌నాద్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాలలో ఇద్దరు మృతి

చంద్రగిరి, జూన్ 20 ప్రభాతవార్త: మండల పరిధిలో శనివారం చోటుచేసుకున్న రెండు వేర్వేరు ప్రమాదాలలో ఇద్దరు మృత్యువాతపడిన దుర్ఘటనలు పనపాకం, శ్రీనివాస మంగాపురంలలో జరిగాయి. వివరాల్లోకెళితే.. పనపాకం పంచాయతీలలో వీధిలైట్లు మార్చటానికి ప్రైవేటు హెల్పర్ భూషణం (55) విద్యుత్ పోల్స్‌పైకి చేరుకున్నాడు. ఆ మేరకు మూడు లైట్లు మార్చి భూషణం నాలుగో పోల్ పైకి చేరుకుని లైట్ మార్చడానికి యత్నించగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై క్రిందపడి మృతి చెందాడు. అయితే విద్యుత్ విభాగానికి చెందిన సబ్ స్టేషన్ హెల్పర్ రెడ్డెప్పకు పవర్ ఆఫ్ చేయమని ముందుగా ఎల్‌సి తీసుకున్నాడు. గ్రామస్థులు చూస్తుండగానే భూషణం షాక్ గురై క్రిందపడటంతో విద్యుత్ సరఫరా లైన్ క్లియరెన్స్ తీసుకున్నప్పటికీ ఏవిధంగా పవర్ పునరుద్ధరించబడినది అనే విషయంలో విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదేవిధంగా శ్రీనివాస మంగాపురం - శ్రీవారిమెట్టు మార్గంలో పశువు దాడికి గురై ఆటో డ్రైవర్ బి.ప్రదీప్ శనివారం మృతి చెందాడు. మిట్టపాళ్యం పంచాయతీ, కొత్తూరు హరిజనవాడకు చెందిన ప్రదీప్ మరో నలుగురు ఆటో డ్రైవర్లు రైల్వే అండర్ బ్రిడ్జ్ వద్ద నీరు నిలిచివడానికి గల కారణాలను పరిశీలించేందుకు బ్రిడ్జిపైకి వెళ్ళినట్లు తెలిసింది. ఈ క్రమంలో పశువు దాడి చేయడంతో బ్రిడ్జిపై నుండి క్రిందపడ్డాడు. దీంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒకే రోజున వేర్వేరు ప్రమాదాలలో ఇద్దరు మరణించిన తీరు హృదయవిధారకంగా మారింది.

చోకింగ్ పై అవగాహన సదస్సు

శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాళహస్తి ఎంజీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఎంజీఎం పాఠశాల ఉపాధ్యాయులకు చోకింగ్ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు అన్నం తినే సమయంలో అన్నవాహికలో సమస్య తలెత్తినపుడు పిల్లలని ఆ సమస్య నుండి కాపాడుటకు తగిన సలహాలను ఇవ్వడమే ఈ చోకింగ్ ముఖ్య ఉద్దేశ్యం. ఈ చోకింగ్ గురించి శ్రీకాళహస్తి లోని ప్రతీ పాఠశాల నందు ఉపాధ్యాయులకు ఈ చోకింగ్ అవగాహనా కార్యక్రమం నిర్వహించి పిల్లలను ప్రాణాప్రాయం నుండి కాపాడాలని వారికి కావలసిన సూచనలను, సలహాలను తెలియచేసారు. చిన్న పిల్లల ఉమామహేశ్వర్ రావు ఈ చోకింగ్ గురించి వివరించారు. ఈ చోకింగ్ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్ తెలియచేసారు.

మహారాష్ట్ర తెలుగు పాఠ్యాంశాలుగా... బాలు గేయాలు

తొట్టంబేడు జూన్ 20 ప్రభాతవార్త: దిగువ సాంబయ్య పాళెం ఫౌండేషన్ పాఠశాల ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కయ్యూరు బాలసుబ్రమణ్యం రాసిన బాలగేయాలు మహారాష్ట్ర తెలుగు పాఠ్యాంశాలుగా ఈ సంవత్సరం తీసుకుంది. రెండవ తరగతి లో బేష్ అని పొగడాలి, 3వ తరగతి లో ఆటలంటే మాకిష్టం, అను రెండు గేయాలు తెలుగు వాచకంలో పాఠ్యాంశాలుగాగా చేర్చారు. ఈ మేరకు మహారాష్ట్ర బాల భారతి తెలుగు అకాడమీ ప్రత్యేక అధికారి డాక్టర్ తులసి భరత్ భూషణ్ సమాచారం అందించారని బాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ఒకటవ తరగతిలో సీతాకోక చిలుక గేయాన్ని తీసుకున్నారని,ఈ సంవత్సరం రెండు,మూడు తరగతులో తాను రాసిన గేయాలు పాఠ్యాంశాలుగా చేర్చడం చాలా ఆనందంగా ఉందని మహారాష్ట్ర తెలుగు అకాడమీ వారికి ధన్యవాదాలు అని అన్నారు.

చెట్లు పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం

బుచ్చినాయుడు కండ్రిగ, జూన్ 20 ప్రభాతవార్త: చెట్ల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కల్లివెట్టు ప్రధానోపాధ్యాయులు వాణి పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా పాఠశాల పరిసరాలను శుభ్రపరిచి, పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో నేషనల్ గ్రీన్ కోర్ సమన్వయకర్త లక్ష్మయ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్ బాబు, దాసు, జగన్నాథం, సుజన, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కారణి సర్‌లో...కందేరి కార్తీక్

బుచ్చినాయుడు కండ్రిగ, జూన్ 20 ప్రభాతవార్త: భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా కారణి పంచా యతీలో జరుగు సర్‌లో పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కందేరి కార్తీక్ చౌదరి పాల్గొని ఇంటింటికి వెళ్లి ఎన్యూరేషన్ ఫారాల పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా కందేరి కార్తీక్ చౌదరి మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎంతో కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓ విజయ, గ్రామ కమిటీ అధ్యక్షుడు కుమార్, గుణశేఖర్ ,తిరుపతి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కందేరి కార్తీక్ చౌదరి పాల్గొన్నారు.

పోక్స్ చట్టంపై పిల్లలకు అవగాహన

బుచ్చినాయుడు కండ్రిగ, జూన్ 20 ప్రభాతవార్త: 18 సంవత్సరాల లోపు పిల్లల కోసం భారత రాజ్యాంగం ఏర్పాటుచేసిన పోక్స్ చట్టంపై పిల్లలకు బుచ్చినాయుడు కండ్రిగ పాఠశాల నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ యమునా మాట్లాడుతూ పిల్లల లైంగిక వేధింపుల అరికట్టేందుకు 2012లో ప్రభుత్వం పోక్స్ చట్టమును తీసుకొచ్చిందని దీనిపై పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రనాథ్, ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు, అంగన్వాడి సూపర్వైజర్లు పాల్గొన్నారు

రెండేళ్ళు పాలన... పాదయాత్రకు విశేష స్పందన

-శివయ్య సన్నిధి నుంచి తిరుమలేశుని ఆలయం వరకు

శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త : రాష్ట్రంలోనూ, శ్రీకాళహస్తిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళు సమర్థవంతమైన పాలన అందించిన సందర్భంగా తనమొక్కును తీర్చుకొనుటకు స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి శనివారం శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధి నుంచి తిరుమలేశుని వాకిలి వరకు పాదయాత్రను నిర్వహించారు. శనివారం ఉదయం రిషితారెడ్డి తమ స్వగ్రామమైన ఊరందూరు నుంచి పాదయాత్రను ప్రారంభించారు. ఊరందూరు గ్రామంలో బొజ్జల బృందమ్మ పూజలు నిర్వహించిన తరువాత పాదయాత్రను రిషితారెడ్డి ప్రారంభించారు. దారి పొడవునా ఆమెకు ఘనస్వాగతం లభించింది, రోడ్డుపక్కన గ్రామాల్లో తెలుగుదేశం కార్యకర్తలు ఆమెకు ఆలసట తెలియకుండా స్వాగతాలు పలికారు. పాదయాత్ర ప్రారంభంలో ఆమెతో పాటు శ్రీకాళహస్తి తెలుగుదేశం మహిళా విభాగం నాయకురాలు సుమతి, చంద్రమ్మలున్నారు. ఈ సందర్భంగా రిషితారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పాలన రావాలని, అలాగే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తన భర్త సుధీర్‌రెడ్డి విజయం సాధించాలని కోరుతూ ఏడుకొండల స్వామిని మొక్కుకున్నానని ఆపద మొక్కుల వాడు అనుగ్రహించాడని వివరించారు. అయితే తాము ఎన్నో సార్లు కొండకు వెళ్ళామని అయితే నేడు తాను తన మొక్కును కాలినడకతో వచ్చి తీర్చుకుంటానని మొక్కుకున్న మేరకు పాదయాత్రగా వెళుతున్నట్లు వివరించారు. రెండేళ్ళలో రాష్ట్రంలో ప్రజారంజకంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలిస్తున్నారని అలాగే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఊహించని అభివృద్ధికి ప్రభుత్వంనుంచి అలాగే కేంద్రం నుంచి నిధులు అందాయన్నారు. దేవస్థానం సారధ్యంలో ప్రజలు ఊహించని అభివృద్ధి సాధ్యమైందన్నారు. ఈ మేరకు ఆపదమొక్కుల వాని మొక్కును తీర్చుకొనుటకు శనివారం ప్రారంభించానన్నారు. ఆమె వెంట మహిళా కార్యకర్తలు,తెలుగుదేశం అభిమానులున్నారు.

శ్రీకాళహస్తి బాలుర ఉన్నత పాఠశాలలో ఆడ్మిషన్లు ఫుల్

-8మంది విద్యార్థులకు త్రిపుల్ ఐఐటిలో ఛాన్సు

శ్రీకాళహస్తి,జూన్ 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని ఆర్‌పిబియస్‌జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడ్మిషన్లకు విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నారు. అతి పురాతనమైన జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 42 మంది విద్యార్థులకు పైగా 500 మార్కులు సాధించారు. శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొదట ఆంగ్ల మీడియంను ఈ పాఠశాల నుంచే శ్రీకారం చుట్టారు. క్రమశిక్షణ, జవాబుదారితనంతో ఉపాధ్యాయులు పని చేయటంతో సత్ఫలితాలు సాధించారు.అలాగే ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో త్రిబుల్ ఐఐటిలో బాలుర జిల్లా పరిషత్ పాఠశాల నుంచి8 మంది విద్యార్థులు ఎంపిక కావటం ఇక్కడ విద్యాప్రమాణాలకు నిదర్శనం. త్రిబుల్ ఐఐటికి ఎన్నికైన విద్యార్థుల్లో జే.రుచిత, యం.హేమంత్, యం.వేణుతేజ, జి.సన్ని, జి.వెంకటమహేష్, కే.లహరి, వై.దీపికలు ఇదుపుల పాయలో సీటు సాధించి శ్రీకాళహస్తిజిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పేరు ప్రతిష్టిలను మిక్కిలి ఇనుమడింపజేసారు.ఈ సందర్భంగా పాఠశాలకు మంచిపేరు తెచ్చిన విద్యార్థులను సత్కరించారు.

అడ్మిషన్లు ఫుల్:

శ్రీకాళహస్తిలోని కొన్ని ప్రైవేటు పాఠశాలలతో పాటు, జిల్లా పరిషత్ బాలురున్నత పాఠశాలలో అడ్మిషన్లకు విద్యార్థుల తల్లిదండ్రులు చొరవ చూపుతున్నారు. ఇప్పటికే పాఠశాలలో 750మంది విద్యార్థులుండగా కొత్తగా మరో 200 మ ందిని చేర్చుకునే అవకాశం ఉండగా ఇప్పటికే 160మంది ని చేర్చుకున్నారు. మరో 60 దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య వివరించారు.

సంప్రదాయ ఆహారంతో ఆరోగ్యం : సుధీర్‌రెడ్డి

- ఒక చిన్న అల్పాహార కేంద్రంలో పార్టీ అనుచరులతో కలసి టిఫిన్

శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త: పెద్ద పెద్ద హోటళ్ళలో వంటకాలు,ఆహారం కన్నా అల్పాహార కేంద్రాల్లోని సంప్రదాయ వంటలు ఎంతో బాగుంటాయని కట్టెల పొయ్యమీద వండే వంటకాలు రుచికరంగా ఉంటాయని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన తన పార్టీ అనుచరులతో కలసి శ్రీ శుకబ్రహ్మాశ్రమం వద్ద రవి టిఫిన్ హోటల్‌లో ఆయన అల్పాహారం తీసుకున్నారు. ఇక్కడ శుకబ్రహ్మాశ్రమంలో సేవలందిస్తున్న యువకులు బతుకు జీవనం కోసం టిఫిన్ హోటల్‌ను ఇంటిలో నిర్వహించుకుంటున్నారు. సంప్రదాయ బద్దంగా నిర్వహించే ఈ టిఫిన్ సెంటర్‌లో పట్టణానికి చెందిన యువకులు ఎంతో మంది దూరమైన వెళ్ళి ఉదయం అల్పాహారం తీసుకుంటుంటారు. మనిషి ఆరోగ్యానికి యోగా ధ్యానం ఎంత అవసరమో అలాగే ఆహార నియమాలు కూడా అంతే అవసరమని వివరించారు. శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి తమ పార్టీ కార్యకర్తలతో ఓ సామాన్యుడిలా చెట్టు కింద కూర్చొని తనకు ఇష్టమైన ఇడ్లి, మసాలా వడ, బొండా, దోసె సాంబార్, చట్నిలతో ఆరగించారు. పట్టణానికి మారుమూల బతుకుజీవనం కోసం కుటుంబం శ్రమను ఆయన కొనియాడారు. తమ ఇంటి వద్దకు వచ్చి ఓ సామా న్యునిలా, తమ చేతి వంటను రుచి చూసిన ఎంఎల్‌ఏకు నిర్వాహకులు రవి ధన్యవాదాలు తెలిపారు. ఆయనతో పాటు బిజెపి రాష్ట్ర ఉపాధ్యాక్షులు కోలా ఆనంద్‌కుమార్, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ జిధరశరాధాచ్చారి. యం.సుబ్బయ్య, శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, శ్రీకాళహస్తి కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు అధ్యక్షులు షేక్ ఖాదర్‌బాషా, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, మాజీ వైస్ చైర్మెన్ మిన్నల్ రవి, డాక్టర్ యం.ఉ మేష్‌రావు, గోపినాధ్,షాకీర్ అలి, మాజీ టౌన్‌బ్యాంకు చైర్మెన్‌డివి నారాయణ, మునిరాజా యాదవ్,,కుమార్, బుజ్జి పేట బాలాజి రెడ్డి,ఈశ్వర్‌రెడ్డి, వినయ్, సిద్దులయ్య, అస్మత్, సుజిత్, ప్రకాష్, మణిదీప్, జనసేన నాయకుడు పసుపులేటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ కుమారునిచే నివారణ పూజలు

శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతు దోష నివారణ పూజలను సినీ నటులు హిందూపురం శాసనసభ్యులు నంద మూరి బాలకృష్ణ తనయుడు నంద మూరి మోక్షజ్ఞ జరుపుకున్నారు. శని వారం ఉదయం రాహుకాల సమయంలో ఆయన ఆలయానికిరాగా ఆలయ మర్యాదలతో వేదపండితుల వేద మంత్రాలతో దక్షిణ గోపురం వద్ద ఇఓ బికె వెంకటేశులు ఆదేశాలతో ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు, ఎపిఆర్‌ఓ రవిలు స్వాగతం పలికారు. ఆలయ ఇఓ వెంకటేశు,ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్‌లు సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద ఏర్పాట్లు చేసారు.ఆయనకు మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వ చనాలు అందించారు. ఆలయ చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్, ఇఓ వెంకటేశు, సభ్యులు అభిమానులు వాకచర్ల గుర్రప్పశెట్టి,గోపినాధ్‌లు, ఇన్స్‌పెక్టర్ హరియాదవ్ ప్రత్యేకంగా స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

స్వచ్ఛ ఆంధ్ర,స్వర్ణాంధ్ర

శ్రీకాళహస్తి,జూన్ 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయ పరిసరాల్లో పారిశుధ్య కార్మికులకు మార్గదర్శకంగా శనివారం ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి రాష్ట్ర ప్రభుత్వం 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'కార్యక్రమాలను చేపట్టారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేయటానికి పూనుకున్నారు. అధికారులు, నాయకులు చీపుర్లు పట్టి ఊడుస్తుండటంతో పారిశుద్ధ్య కార్మికుల్లో కూడా జవాబుదారి తనం వచ్చింది. శానటరి ఇన్స్‌పెక్టర్ కృష్ణారెడ్డి ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయనతో పాటు ఆలయ చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్,సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి,గోపినాద్, ఆలయ ఇఓ బికె వెంకటేశులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి మున్సిపల్ సారధ్యంలో 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'

శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ కెవి కృష్ణారెడ్డి సారధ్యంలో శనివారం 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమాలను చేపట్టారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల్లో ఈ కార్యక్రమాలను చేపట్టారు. ప్రతి నెల నాల్గవ వారం ప్రణాళికలో భాగంగా శనివారం స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సూచనలతో మున్సిపల్ ప్రత్యేకాధికారి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి పర్యవేక్షణలో కమిషనర్ కెవి కృష్ణారెడ్డి కార్యక్రమాలను చేపట్టారు. ప్రభుత్వాసుపత్రి రోడ్డును స్వీపింగ్ పెట్టారు. అలాగే పబ్లిక్ టాయిలెట్స్‌ను పరిశుభ్రం చేసారు. వీధిలో పేరుకుపోయిన చెత్తలను తొలగించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కెవి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ క్లీన్‌స్విప్ అమలు అనేది స్వచ్ఛమైన,ఆరోగ్యకరమైన ఆంధ్ర ప్రదేశ్‌ను నిర్మించటంలో ఒక కీలక మైలురాయిగా అభివర్ణించారు. ఈ అవగాహన ర్యాలిలో శానిటరి ఇన్స్‌పెక్టర్లు, కార్యదర్శులు, పర్యవేక్షకులు, స్థానిక ప్రజలు యువకులు పాల్గొన్నారు.

5వ సెమిస్టర్‌లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ప్రతిభ

శ్రీకాళహస్తి,జూన్ 20 ప్రభాతవార్త: ఎస్‌వి యూనివర్శిటి డిగ్రీ 5వసెమిస్టర్ ఫలితాలను విడుదల చేసింది. ఈ ఫలితాల్లో శ్రీకాళహస్తి ఆక్స్ ఫర్డ్ కళాశాల ర్యాంకులు పంటను పండించి శ్రీకాళహస్తిలోనే కాకుండా యూనివర్శిటీ పరిధిలో కూడా మొదటి వరుసలో నిలిచారు. ఈ మేరకు శనివారం కళాశాల కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూధనరెడ్డి తమ కళాశాల పరిధిలో విద్యార్థులు సాధించిన ర్యాంకులను వివరించారు.ఆది నుంచి డిగ్రీ పరీక్షల్లో ఆక్స్ ఫర్డ్ విద్యార్థులు ర్యాంకుల సాధనలో మొదటి స్థానం సాధిస్తున్నారు. ఉపాధ్యాయుల చొరవకు తోడు విద్యార్థుల శ్రద్ధ తోడు కావటంతో సత్ఫలితాలు సాధిస్తున్నారు. 5వ సెమిస్టర్ ఫలితాల్లో విజయ సంకేతం ఎగుర వేసిన విద్యార్థుల వివరాలను కరస్పాండెంట్ మధుసూధనరెడ్డి ప్రకటించారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థుల వివరాలు:

ఎస్‌వి యూనివర్శిటి జారి చేసిన 5వ సెమిస్టర్ ఫలితాల్లో బియస్‌సి కంప్యూటర్ సైన్సు గ్రూపుల్లో కే.తేన్మోళి (8,8),వి.హేమలత(8.57) ఎ స్చైతన్య (8.51) పాయింట్లతో యూనివర్శిటి స్థాయిలో వరుసగా ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాలు సాధించినట్లు తెలిపారు. బియస్‌సి బయోటెక్నాలజీ ఆనర్స్ గ్రూపు నందు కె.పావని(9.03) కె.లిఖితశ్రీ(8.84) జి.రేష్మ(8.75) పాయింట్లు సాధించి యూనివర్శిటి స్థాయిలో వరుసగా మూడు స్థానాలు దక్కించుకున్నారని వివరించారు.బికాం హానర్స్‌లో జే.సిందూ ప్రియ(9.0), పి.హేమలత (8.75),బి.దుర్గ (8.47) పాయింట్లతో యూనివర్శిటి స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాదించినట్లు తెలిపారు. ఈసందర్భంగా ర్యాంకుల పం టతో కళాశాల పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేసిన విద్యార్థులను కరస్పాండెంట్ మధుసూధనరెడ్డి అభినందించారు.

బాలకృష్ణ అభిమానుల సందడి

శ్రీకాళహస్తి,జూన్ 20 ప్రభాతవార్త: సినీ నటులు నందమూరి బాలకృష్ణ అంటే ఎనలేని అభిమానం కల్గిన శ్రీకాళహస్తికి చెందిన యువకుడు బాలు డిల్లిబాబు శనివారం శ్రీకాళహస్తీశ్వ రాలయానికి ఆయన తనయుడు నందమూరి మోక్షజ్ఞన పూజలకు రావటంతో అంతా తానై ఏర్పాట్లు పర్యవేక్షించారు. నందమూరి బాలకృష్ణ అంటే ఎనలేని అభిమానంతో సాగుతున్న బాలు డిల్లిబాబు శనివారంఉదయం నుంచి ఆలయం వద్దనే నిరీక్షించారు. అతిధి గృహంలో ఆయన తండ్రి బాలకృష్ణపై తమ అభిమానాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. బాలు డిల్లిబాబుతో పాటు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి పాల్గొన్నారు.

రాస్‌సారధ్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని రాస్ మహిళా పొదుపు సంఘాల అధ్వర్యంలో శనివారం అంత ర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాస్ ప్రధాన కార్యదర్శి మునిరత్నం, డైరెక్టర్ నాగరాజుల పర్య వేక్షణలో యోగా కార్యక్రమాలను స్థానిక నాయకులు ఏర్పాటు చేసారు.ఈ కార్యక్ర మాలకు తిరుపతికి చెందిన ప్రముఖ యోగా అండ్ వెల్నెస్ శిక్షకులు శ్రీనివాసులు నాయుడు, హైమావతిలు హాజరయ్యారు. వారు మహిళలకు ప్రత్యేక యోగా శిక్షణ ఇచ్చారు. మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలకు యోగా చక్కటి సాధనమని అవగాహన కల్పించారు. ఈకార్యక్రమాలను రాస్‌కు చెందిన మునిశేఖర్, మీనా, వినోద్‌లతో పాటు సుమారు 100 మందికి పైగా పొదుపుమహిళా సంఘాల ప్రతినిధులు సభ్యులు హాజరయ్యారు.

స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం

శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త: ఈ కార్యక్రమములో ఆయన సిబ్బంది రీడర్స్ విద్యార్థులతో కలిసి స్వయంగా పరిసరాలను శుభ్రం చేస్తూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వనాయకత్వంలో ప్రభుత్వం వచ్చినప్పటి నుంచే ఈ యొక్క స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం తీసుకుని వచ్చి ప్రజలకు అవగాహన కల్పించిదన్నారు. అందులో భాగంగా ఈరోజు ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం, శ్రీకాళహస్తి నందు గ్రంథాలయ పాఠకులు,విద్యార్థిని విద్యార్థులు, మరియు గ్రంథాలయ సిబ్బందిచే స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమము నిర్వహిస్తూ స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించడమైనది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు యన్ ఎస్ లావణ్య,ఎ హరికృష్ణ, పాఠకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనారు.

ఏర్పేడు మండలంలో దొంగల హల్చల్

-ఒకే గ్రామంలో ఐదు స్టార్టర్లు మాయం

ఏర్పేడు, జూన్ 20 ప్రభాతవార్త : ఏర్పేడు మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో దొంగలు రెచ్చిపోతున్నారు. రాత్రి వేళల్లో వ్యవసాయ మోటార్ల వద్ద కాపలా లేని సమయాన్ని ఆసరాగా చేసుకుని దొంగత నాలకు పాల్పడుతున్నారు. తాజాగా శనివారం తెల్లవారుజామున మండలం లోని అముదూరు పంచాయతీ పరిధిలో గల బండివానిపల్లి గ్రామంలో ఒకేసారి ఐదు స్టార్టర్లు దొంగతనానికి గురికావడం స్థానిక రైతుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. బాధిత రైతులు గ్రామస్థుల కథనం ప్రకారం, బండివానిపల్లి గ్రామ పరిధిలోని పొలాల్లో రైతులు ఎప్పటిలాగే రాత్రి వేళల్లో మోటార్లకు స్టార్టర్లు ఆన్ చేసి ఉంచారు. అయితే శనివారం తెల్లవారుజామున సమయంలో గుర్తుతెలియని దొంగలు పొలాల్లోకి చొరబడ్డారు. గ్రామానికి చెందిన రైతు గుండాల సుబ్బరామయ్యకు చెందిన తోటల్లోని ఏకంగా, మూడు స్టార్టర్లను దొంగలు దర్జాగా విరగ్గొట్టి ఎత్తుకెళ్లారు. అలాగే అదే గ్రామానికి చెందిన బండి వెంకటేశ్వర్లు, పరమాల పొందయ్య, పరమాల గంగయ్యలకు చెందిన వ్యవసాయ మోటార్ల స్టార్టర్లను కూడా దొంగలు అపహరించుకుపోయారు. ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు స్టార్టర్లు మాయమవ్వడం చూసి లబోదిబోమన్నారు. ఒక్కో స్టార్టర్ వేల రూపాయల విలువ చేస్తుందని, పంటలు చేతికి వచ్చే సమయంలో ఇలా దొంగలు పడి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఏర్పేడు పోలీసులు ఈ చోరీలపై స్పందించి, నిఘా పెట్టి, తమకు న్యాయం చేయాలని బండివానిపల్లి గ్రామ రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి



శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయని, వాటి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక దృష్టి సారించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూసంక్షేమ హాస్టళ్లలో సరైన మౌలిక వసతులు లేకపోవడం, తాగునీటి సమస్యలు, అపరిశుభ్రమైన మరుగుదొడ్లు, నాసిరకం ఆహారం, తగినంత మంచాలు మరియు ఫ్యాన్లు లేకపోవడం వంటి సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.